RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 149 | బుధవారం, 18 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

# నిరుపేదలకు సాయం!



- వారిని గుర్తించే పనిలో సర్కార్
- భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం
- రెండు విడతలుగా ఇచ్చే సాయం తొలి దఫా నిధులు ఆరు వేల రూపాయలను ఈ నెల 28న విడుదల
- కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28ని నిధుల విడుదలకు ముహూర్తంగా ఎంచుకున్నారు
- అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకంపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది
- ఈ ఏడాది మొదట్లోనే ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసింది.

**హైదరాబాద్**

తెలంగాణలో భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం ఇవ్వబోతున్నట్టు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. రెండు విడతలుగా ఇచ్చే సాయం తొలి దఫా నిధులు ఆరు వేల రూపాయలను ఈ నెల 28న విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28ని నిధుల విడుదలకు ముహూర్తంగా ఎంచుకున్నారు. భూమి ఉన్న రైతులకు ఇప్పటికే ఏటా 12 వేల రూపాయాలను ప్రభుత్వం ఇస్తోంది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీన్ని సంక్రాంతి నుంచి ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది. అంత కంటే ముందు భూమి లేని రైతులకు సాయం చేయాలని భావిస్తోంది. అయితే అర్హుల ఎంపిక చేస్తారు. ఎన్ని కోట్లు ఖర్చు కానుందనే చర్చ మొదలైంది. అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకంపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది మొదట్లోనే ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇప్పుడు అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అర్హులను ఎలా ఎంపిక చేస్తారు. అర్హులు ఎవరు.. ఎంతమందికి ఈ నిధులు అందజేస్తారనే వివరాలు సభలో ప్రకటించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. తెలంగాణలో భూమి లేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టలేదు. పదేళ్లుగా చాలా రకాల సర్వేలు ప్రకటించినప్పటికీ ఈ భూమి లేని నిరుపేదల విషయంలో ఎలాంటి లెక్కలు లేవని తెలుస్తోంది. ఈ మధ్య ప్రభుత్వం



## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ

- పార్లమెంట్ హౌస్ అన్నెక్సీలో ఈ భేటీ
- వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై చర్చ
- రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ




## జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు

- సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి
- జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు..
- సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి
- బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు
- ఆ ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు

# కేటీఆర్ చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామావు చేసింది పెద్ద తప్పు
- కేటీఆర్ ఏడేండ్ల వరకు జైల్లోనే ఉండాల్సి వస్తుంది
- కేటీఆర్‌కు బెయిల్ రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కుతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శబరిమల వెళ్ళటానికి నల్ల దుస్తులు ధరించినట్లుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి రావటంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద చిట్ చాట్‌గా మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామావు చేసింది పెద్ద తప్పు అని, ఆయన జైలుకు వెళ్ళక తప్పదని అన్నారు. కేటీఆర్ ఏడేండ్ల వరకు జైల్లోనే ఉండాల్సి వస్తుందని, ఆయన చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదని మంత్రి అన్నారు. కేటీఆర్‌కు బెయిల్ రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కుతున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శబరిమల వెళ్ళటానికి నల్ల దుస్తులు ధరించినట్లుందని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా



## సావర్కర్‌ను కాంగ్రెస్ విమర్శించవద్దు

- బీజేపీ, కాంగ్రెస్‌లకు ఠాకరే కీలక సూచన
- సావర్కర్ కు భారతరత్న ఇవ్వాలన్న ఠాకరే
- నెహ్రూను బీజేపీ విమర్శించవద్దని హితవు

# అసెంబ్లీలో అప్పులపై రగడ

- నేతల మధ్య మాటల యుద్ధం
- ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ
- గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్
- "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" భట్టి సవాల్
- నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్...
- ఎలాంటి చర్చ లేకుండానే మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం




**హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. అప్పులపై అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం అసెంబ్లీ మొదలవగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు .



## రాష్ట్రపతి ముర్ముకు హైదరాబాద్‌లో గవర్నర్, సీఎం ఘన స్వాగతం

- హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- శీతాకాల విడిది కోసం నగరానికి వచ్చిన రాష్ట్రపతి
- ఈ నెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం

**హైదరాబాద్**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేట విమానాశ్రయంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో గవర్నర్, సీఎంతో పాటు మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు. రాష్ట్రపతి హకీంపేట నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి-

తెలంగాణ సేన

## సంపాదకీయం

# మళ్లీ విద్వేషాలు విజృంభిస్తున్న వేళ..

కొందరి పేర్లు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. ఎంత కాలం గడిచిపోయినా చరిత్రలో వారి పేర్లను, వారు చేసిన పనులను చెరిపివేయడం అంత సులభం కాదు. పాములపర్తి వెంకట నరసింహారావు ఇదే డిసెంబర్ మాసంలో దివంగతులై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన పేరు స్మరించుకునే అవసరం నేటి రాజకీయ నాయకులకు కలిగింది. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రతా మండలికి బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను కూడా విస్మరించి, ఆ పార్టీ అగ్రనేతల సమక్షంలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేత జరిగింది. ఈ ఘటనకు పీవీనే చాలా మంది తప్పుపట్టారు. అయితే అంతకు సరిగ్గా ఏడాది ముందే 1991లో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మతపరమైన భావోద్వేగాలు తలెత్తకుండా చూసింది కూడా పీవీయే అన్న విషయం చాలా మంది మరిచిపోయారు! సంభల్‌లో మతపరమైన హింసాకాండ, మధురలో వివాదం నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కూడా ఆ చట్టం గుర్తుకువచ్చింది. ఇదే ఏడాది ప్రథమంలో పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని తమ పార్టీ నేతలే అంటుంటే వారించలేకపోతోంది. నరసింహారావును అనేక సార్లు అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతలకు కూడా ఇప్పుడు పీవీ ప్రభుత్వమే ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదింపచేసిన విషయం గుర్తుకు వచ్చింది. నిజానికి ఈ చట్టంపై మళ్లీ చర్చ రేపి తీగ లాగింది కొద్ది రోజుల క్రితం పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్. ఒక మత ప్రదేశపు స్వభావాన్ని మార్చడం 1991 చట్టం క్రింద నిషేధించినప్పటికీ, ఆ ప్రదేశపు మత స్వభావాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడాన్ని ఆ చట్టం అడ్డుకోలేదని చంద్రచూడ్ వ్యాఖ్యానించి ప్రస్తుత వివాదాలన్నిటికీ తెర లేపారు. దేశంలో అనేక ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాలలో సర్వేల కోసం పిటిషన్లు దాఖలయ్యాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించిన స్థానిక కోర్టు ఈ చట్టం ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా యూపీలోని సంభల్ మసీదులో అలాంటి సర్వేను జిల్లా కోర్టు అనుమతించినందుకే గత నెలలో మతపరమైన హింసాకాండ జరిగింది. ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ప్రార్థనా మందిరాల విషయంలో దేశంలో అన్ని కోర్టులు యథాతథ స్థితి నెలకొనేలా చూడాలని గత వారం ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1991 చట్టం చెల్లుతుందా లేదా అన్న విషయం తాము తేల్చేంతవరకూ ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరిపించాలని దాఖలైన పిటిషన్లను ఏ కోర్టూ నమోదు చేసుకోవద్దని, ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అసలు ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల్లో తన అభిప్రాయం ఏమిటో చెప్పాలని స్పష్టంగా నిర్దేశిస్తూ 2025 ఫిబ్రవరి 17 వరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనితో కనీసం మూడునెలల వరకైనా ప్రార్థనా స్థలాల విషయంలో మత పరమైన భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసినట్లైంది. అయోధ్యలో రామజన్మభూమిపై బీజేపీ నిర్వహిస్తున్న ఉద్యమం తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన పీవీ నరసింహారావు, వచ్చీ రాగానే దేశవ్యాప్తంగా ఇతర ప్రార్థనాస్థలాల్లో ఇలాంటి భావోద్వేగాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రార్థనాస్థలాల్లో యథాతథ పరిస్థితిని పరిరక్షించేందుకు చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 1991 జూలైలో రాష్ట్రపతి వెంకట్రామన్ పార్లమెంటు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలోనే స్పష్టం చేశారు. ఆ తరువాత సెప్టెంబర్‌లో రెండు రోజుల పాటు లోక్‌సభలో అద్భుతమైన చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు దేశంలో అసహనం వ్యాప్తి చేయాలని చూస్తున్నాయని, ప్రజలు ఏనాడో మరిచిపోయిన వివాదాలను తిరగదోడి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, అలాంటి కొత్త వివాదాలు రేకెత్తకుండా ఉండేందుకే ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) బిల్లును ప్రవేశపెడుతున్నామని హోంమంత్రి ఎస్.బి. చవాన్ స్పష్టం చేశారు. ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పర్చడమే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. బీజేపీ నుంచి అడ్వాణీ, జస్వంత్ సింగ్, ఉమాభారతి, రాంనాయక్ తదితరులుబీ కాంగ్రెస్ నుంచి దిగ్విజయ్ సింగ్, పిఎం సయీద్, మణిశంకర్ అయ్యర్‌బీ సీపీఐ(ఎం) నుంచి సోమనాథ ఛటర్జీబీ సీపీఐ నుంచి ఇంద్రజిత్ గుప్తా, గీతా ముఖర్జీ అత్యంత ప్రతిభావంతంగా చర్చలో పాల్గొన్నారు. ఆ చర్చల ప్రామాణికతతో పోలిస్తే ఇవాల్టి చర్చలు పేలవంగా కనిపిస్తాయి. ఈ బిల్లు వల్ల మనం సాధించేది ఏమీ లేదని, కొత్త వివాదాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అడ్వాణీ అన్నారు. ప్రతి వివాదానికీ పరిష్కారం లభించాల్సిందేనని, అన్ని మత ప్రదేశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ఉమాభారతి స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బీజేపీకి మిత్రుడుగా మారిన అప్పటి జనతాదళ్(యు)కు చెందిన దళిత నేత ఒకరు ఈ బిల్లును బలంగా సమర్థించారు. ఈ దేశంలో 33 కోట్లమంది దేవుళ్లు ఉన్నప్పటికీ దేశంలోని 5,76,000 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని గుర్తు చేశారు. లక్షలాది ప్రజలు ఆకలితో, వైద్య చికిత్సలు లేకుండా, ఉపాధి లభించకుండా మరణిస్తున్నారని, ఇలాంటి తీవ్రమైన అంశాలను పరిష్కరించకుండా మతపరమైన ఘర్షణల్లో కూరుకుపోవడం శోచనీయమని, ఎక్కడ మసీదు ఉందో, ఎక్కడ ఆలయం ఉందో తేల్చడం ప్రధానం కాదని సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీ అన్నారు. అదే సమయంలో అయోధ్య వివాదాన్ని చర్చల ద్వారా లేదా న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రార్థనాస్థలాల బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఒక్క అయోధ్యలో మినహా దేశంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎక్కడా ప్రార్థనాస్థలాల విషయంలో వివాదాలు రేగలేదు. ఒక్క అయోధ్య అంశం వల్లనే బీజేపీ క్రమక్రమంగా ఎన్నికల రాజకీయాల్లో పుంజుకొన్నది కనుక ఇతర అంశాలను పక్కన పెట్టింది. అయోధ్యతో బస్ ఝాంకీ హై, కాశీ మధురా బాకీ హై అని ఒకప్పుడు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసేవారు. కాని మేనిఫెస్టోలో మాత్రం ఇతర ప్రార్థనా స్థలాల గురించి ప్రస్తావించకుండా సంయమనం పాటించారు. కాశీ, మధుర మాటేమిటి? అని 2022 లో బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాను ప్రశ్నించినప్పుడు ఏ వివాదమైనా కోర్టులు, రాజ్యాంగం ద్వారా పరిష్కరించుకోవాల్సిందేనని చెప్పారు. అయోధ్య ఉద్యమం ఒక మినహాయింపు మాత్రమేనని, ప్రతి మసీదులోనూ శివలింగం గురించి వెతకడం సరైంది కాదని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆసేతు హిమాచలాన్ని సమైక్య పరిచే శ్రీరాముడు వివాదాల్ని సృష్టించడని, ఆయన పరిష్కారాలు సూచిస్తారని రామమందిర ప్రారంభం తర్వాత ప్రధాని నరేంద్రమోదీ కూడా అన్నారు. చారిత్రక తప్పిదాలను సవరించడం కన్నా శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించడంపై దృష్టి కేంద్రీకరించాలని ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వంటి బీజేపీ నేతలు కూడా అన్నారు.

# మీ కోసం ఆదివాసీలు నిర్వాసితులు కావాలా?



2024 జనవరి నుంచి మొదలై మాడ్‌తో సహా యావత్ దండకారణ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనిక దాడులతో రక్తసిక్తమవుతున్న అడవుల నుంచి ప్రజలను ఖాళీ చేయించే చర్యలను కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాయపూర్‌లో జరిపిన ఏడు మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దేశంలో మావోయిస్టులను, మావోయిజాన్ని 2026 మార్చ్ నాటికి అంతమొందిస్తామని ఆ సమావేశం ప్రకటించింది. అందుకోసం ప్రస్తుత కగార్ దాడులను రెట్టింపు వేగంతో, తీవ్రతతో కొనసాగించాలనీ నిర్ణయించింది. ఈ దాడులను 'మాడ్ బచావో' కేంపెయిన్ పేరుతో కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. వారి లక్ష్యాన్ని చేరడానికి మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, మాడ్ ప్రాంతం నుంచి ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించే చర్యలను చేపడుతున్నారు. తిరిగి మూడేళ్లకు మీ ప్రాంతాలకు మీరు చేరుకుంటారనీ ప్రజలను మభ్యపెడుతున్నారు. భారత సైన్యాలు మావోయిస్టు ఆపరేషన్‌లలో పాల్గొనవని కేంద్ర హెూంమంత్రి బుకాయిస్తున్నారు కానీ, ఇప్పటికే అనేక సంవత్సరాలుగా వేరు వేరు రూపాలలో భారత సైన్యాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లలో పాల్గొంటున్న విషయం బహిరంగ రహస్యమే. కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వివిధ ప్రాజెక్టుల పేరుతో దేశంలో నిర్వాసితులైన వారిలో ఆదివాసీలే అధిక సంఖ్యలో ఉన్నారు. దండకారణ్యంలో 1970లలో చేపట్టిన కిరండాల్ తవ్వకాలతో పెద్ద ఎత్తున ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. ఇంచుమించు అదే సమయంలో మార్దూంలో అత్యంత రహస్యంగా భారత రక్షణరంగ యూనిట్‌ను నిర్మించినపుడు ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. 1980ల నాటికి మాడ్ కొండలపై నుండి ఆదివాసీలను మైదాన ప్రాంతాలకు తరమడానికి అన్ని సన్నాహాలు జరిగాయి. అడవుల నుంచి మనుషులను తరిమివేసి పులులను పెంచి పోషించే ప్రభుత్వ విధానాలతో 1980లలోనే వర్తమాన బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియా నుంచి పదుల గ్రామాలను ఖాళీ చేయించ పూనుకున్న పరిస్థితులలో ఆదివాసీలు సంఘటితంగా దానిని ఎదుర్కొన్నారు. తిరిగి ఇపుడు వారికి తమ గ్రామాలను ఖాళీ చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. గత నాలుగేళ్ల నుంచి అనేక కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వేగంగా కొనసాగిస్తున్న గనుల తవ్వకాలతో బృహత్ బస్తర్‌లో, గడ్చిరోలీలో కాలుష్యం ప్రబలుతూ ప్రజల పంట భూములు వల్లకాడై పోతున్నాయి. జనావాసాలు నివాసయోగ్యం కాకుండా పోతున్నాయి. పచ్చని అడవులు నాశనమవుతున్నాయి. 2030 నాటికి గడ్చిరోలీ జిల్లాను పారిశ్రామిక జిల్లాగా మారుస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ప్రకటించాడు. ఈ పరిణామాలతో ఈ ప్రాంతాలలోని ఆదివాసీలు ఏ పట్టణాలకో, ఏ నగరాలకో, ఏ మురికివాడల జీవితాలకో బలి కానున్నారు. చాలా బాధాకరమైన విషయం ఏమంటే, ఈ ప్రాంతాలలోని ఆదివాసీ తెగలు భారత రాజ్యాంగం ప్రకారం అంతరించిపోతున్న తెగల జాబితా లోకి వస్తారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాన్ని పణంగా పెడుతూ వారి అస్తిత్వాన్నే ధ్వంసం చేస్తున్నారు. గతంలో ఫాసిస్ట్ సల్వాజుడుం సమయంలో సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల్లోని వేలాదిమంది ప్రజలను తమ అడవుల నుంచి, గ్రామాల నుంచి తరిమి 'సహాయశిబిరాల' పేరుతో రోడ్డుపక్కన నిర్మించిన 'షెల్టర్'లలోకి తరలించారు. ఆ షెల్టర్లన్నీ నరక కూపాలే. వాస్తవంగా అవన్నీ కాన్‌సెంట్రేషన్ క్యాంపులే. అక్కడ ప్రజలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. మహిళల జీవితాలలో కనీస భద్రత కరువైంది. అడవులలో స్వేచ్ఛగా తిరుగుతూ తమ దైనందిన అవసరాలను తీర్చుకునే ఆదివాసీలకు 'సహాయ శిబిరాల' జీవితాలు మృత్యు కుహరాల్లాంటివే. బలవంతంగా ఆ శిబిరాలకు తరలించబడిన ప్రజలు అక్కడ ఉండలేక వివిధ రూపాలలో తిరిగి తమ అడవులకు, గ్రామాలకు చేరుకున్నారు. వారికి విప్లవోద్యమంతో సహా అనేకమంది ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు సహకరించారు. “1950లో భారతదేశ ప్రజాస్వామ్యానికి నైతిక పునాది అయిన భారత రాజ్యాంగాన్ని పార్లమెంటు ఆమోదించిన రోజు నిజానికి ఆదివాసులకు దురదృష్టకరమైన రోజు. రాజ్యాంగం వలస విధానాన్నే స్థిరీకరిస్తూ ఆదివాసుల నివాస ప్రాంతాలకు రాజ్యం సంరక్షకురాలిగా ఉంటుందని తేల్చింది. ఉన్నట్టుండి మొత్తం ఆదివాసీ సమూహాలన్నింటినీ వాళ్ల సొంత నేల మీదే పరాయివాళ్లను చేసింది. అటవీ ఉత్పత్తుల మీద వారి సంప్రదాయ హక్కును నిరాకరించి వారి జీవన విధానాన్నే నేరమయం చేసింది. ఓటుహక్కుకు బదులుగా, వాళ్ల జీవించే హక్కును, ఆత్మగౌరవాన్ని లాగేసుకుంది” %-% అని అరుంధతీరాయ్ 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' పుస్తకంలో సరిగ్గా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మాడ్ కొండలలోని ప్రజలు కోరుతున్నదేమిటి? వారు తమ 'కొండలను ఖాళీ చేయం' అంటున్నారు. వారు తమ భూములను వదలం అంటున్నారు. తమ అడవులను కాపాడుకోవాలంటున్నారు. ప్రకృతి వనరులను దేశం కోసం, ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసం నిలుపుకోవాలంటున్నారు. మాడ్ కొండలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అన్ని చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లలో భారత సైన్యాలు పాల్గొంటాయా, లేదా అనేది వేరే విషయం. దానితో, ఈ అంశాన్ని ముడిపెట్టడం ప్రభుత్వాల మోసకారి విధానమే అవుతుంది. మధ్య భారత అడవులలో భారత సైన్యాల శిక్షణా శిబిరం ఏర్పాటును ఒక దీర్ఘదృష్టితో వ్యూహాత్మక పథకంతో రూపొందిస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాలకవర్గాలు దానినుంచి బయటపడడానికి ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదలను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో భాగంగా ముందునుంచే భారత సైన్యాలకు గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణను అందిస్తున్నారు. అనేక దేశాలలో ప్రజలు సంక్షోభాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్నారు. వర్తమాన పరిస్థితులలో అలాంటి వెల్లువ భారతదేశంలో కూడా సంభవించడానికి పూర్తి అవకాశాలున్నాయని గ్రహించే ఇలాంటి ముందస్తు చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో, దేశంలోని సమస్త ప్రగతిశీల శక్తులు, విద్యార్థి, మేధావి, కార్మిక, కర్షక శక్తులు, రచయితలు, కళాకారులు మాడ్ ప్రజల న్యాయమైన అస్తిత్వ సమస్యను సమర్థిస్తూ వారికి అండగా నిలువాలనీ, మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని రద్దు చేయడానికి ఉద్యమించాలనీ మా విన్నపం.

# రంగన్న ఆశలు నెరవేరుతాయా?

మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు సాధించటం అనే ఆశయానికి నిబద్ధమైన వ్యక్తి నల్లవెల్లి రంగారెడ్డి. 1951లో గన్యాగుల గ్రామంలో జన్మించాడు. మధ్య తరగతి కుటుంబం అనుభవించే ఈతిబాధలన్నీ అనుభవించాడు. 1976లో డిప్యూటీ ఇంజనీర్‌గా సాగునీటి శాఖలో ప్రవేశించి వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, గద్వాల, హైదరాబాద్, శ్రీకాళహస్తి, నల్లగొండ తదితర చోట్ల విధులు నిర్వహించి, 38 సంవత్సరాలు వివిధ హెూదాలలో పనిచేసి, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగ విరమణ చేశాడు ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులను, ఎత్తిపోతల పథకాలను పరిశీలించాడు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఎందుకు మహబూబ్‌నగర్ జిల్లాను వివక్షకు గురి చేస్తున్నాయని చింతించేవాడు. ఆర్థిక వెనుకబాటుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోకపోవడం వల్ల విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేచోట జిల్లా ప్రజలు లేరని, అందువల్ల లోపల ఏం జరుగుతుందో మనకు తెలియడం లేదని అనేవాడు. రాజకీయ నాయకులకే పట్టింపు లేనప్పుడు మనం ఏం చేయగలమని బాధపడేవాడు. అయితే వారిని చైతన్యం చేస్తే మాట్లాడతారని ఆశపడ్డాడు. దీనికి ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం విజయం కలిసి వచ్చింది. స్వయంగా తోటి ఇంజనీర్లతో కలిసి బస్సుల్లో ఎ.ఎం.ఆర్ పథకం పనితీరును జిల్లా రాజకీయ నాయకులకు చూపించాడు. అప్పటికే మేము కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని పార్టీలు, రాజకీయ నాయకులపై పోరాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాం. అయినా పదేళ్ల పాటు చిన్న రాయి కూడా వేయకుండా కేవలం శంకుస్థాపనల తంతు నడిపారు. చివరికి 2005లో పనులు ప్రారంభించి 2012 నాటికి కొంత మేర పూర్తి చేశారు. కృష్ణానది జలసాధన ఉద్యమంలోంచే తెలంగాణ ఉద్యమం పుట్టినా, తెలంగాణ ఏర్పడి పదేండ్లు దాటినా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీటి న్యాయం దక్కనే లేదు. తెలంగాణలో ఏర్పడిన తొలి ప్రభుత్వం జల వివాదాలున్న నీటి ఎద్దడి ప్రాంతం కోసం కాక, కాళేశ్వరం చేపట్టి నిధులు అటు మళ్లించిందని రంగారెడ్డి ఆవేదన చెందాడు. ఆయనను తీవ్రంగా కలచివేసిన విషయం... పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 2013 ఆగస్టులో సాధించుకున్న 72 జీవోతో కాక, 2015 జూన్ 11న కేసీఆర్ విడుదల చేసిన 105 జీవోతో చేపట్టి, వంచించటం. ఇది సరి కాదని రామకృష్ణారెడ్డి, మల్లయ్య, రవీందర్‌రెడ్డి వంటి నిపుణులైన మహబూబ్‌నగర్ ఇంజనీర్లు ఎంత మొత్తుకున్నా కేసీఆర్ వినలేదు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అరకొర నిధులతో పనులు నానబెట్టారు. ఈ పనుల కోసం ఆయన రంగారెడ్డినే ఓఎస్డీగా నియమించాడు. కానీ, ఎప్పటికప్పుడు వాస్తవాలు తెల్పటాన్ని జీర్ణించుకోలేక, రెండోసారి ఆయన పదవీకాలాన్ని పొడిగించలేదు. మూడేళ్లలో పూర్తి కావలసిన పథకం ఇంకా మూలన పడి ఉన్నది. పనులు పూర్తి కాకుండానే ఒక పంపు నీరు దుంకించి మన జిల్లాను అవమానించాడని రంగన్న బాధపడ్డాడు. మహబూబ్‌నగర్ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఏర్పడాలనే మా సంకల్పానికి సహకరించాడు. పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇన్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి కాక శ్రీశైలానికి మార్చడంతోనే వివాదాలు చుట్టుకున్నాయి. శ్రీశైలం అంతర్రాష్ట్ర ప్రాజెక్టు కావటం వల్ల ఆంధ్రా అడ్డుకుంది. ఎ.ఎం.ఆర్, ఎస్.ఎల్.బి.సి నీరు తీసుకునే అవకాశం ఉన్నా, ఒకరిద్దరు స్వార్థపరులు పాలమూరు%-%డిండి అనే కొత్త పథకం ముందుకు తెచ్చారు. డిండి ఎత్తు పెంచి నార్లాపూర్ లేదా ఏదుల లేదా వట్టెం నుంచి నీరు తరలించుకుపోయే ప్రతిపాదన తెచ్చారు. దీనిపై జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడవలసి వచ్చింది. ఈ అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయడానికి ఎమ్మెల్యేలను ఒప్పించడంలో రంగన్న పాత్ర ఉంది. కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఆ ప్రతిపాదన ఉండదన్నారు. పాలమూరు పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఎందుకు చేపట్టలేదో రంగన్న వివరంగా చెప్పాడు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ లాబీ చేతిలో ఉందన్నాడు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, భట్టి విక్రమార్క స్వయంగా హామీ ఇచ్చినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనుల్లో చలనం లేదు. అసలు మహబూబ్‌నగర్ సాగునీటి పథకాలు చాలా చిన్నవి. ఆర్డీఎస్ పథకం దెబ్బతినిపోయింది. సుంకేశుల ఆనకట్టను భారీగా నిర్మించారు కానీ, ఆర్డీఎస్‌ను వదిలేశారు. కోర్టు తీర్పు ప్రకారం ఇవ్వాల్సిన నీరు కూడా ఇవ్వడం లేదు. జూరాల నిర్వహణ సరిగా లేదు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాల పంపుల సామర్థ్యం, కాలువల సామర్థ్యం, రిజర్వాయర్ల సామర్థ్యం చాలా చిన్నవి. వాటి స్థాయి మెరుగుదలకు ఏం చేయాలో కేసీఆర్ ఒక్కసారి కూడా సమీక్ష జరపలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఏమీ చేయలేదు. ఒక ఇంజనీర్ల బృందంతో అధ్యయనం చేయించి వారి సూచనలు అమలు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు పాలమూరు%-%రంగారెడ్డి పథకానికి కేటాయించిన 90 టిఎంసిల నీటిని రెండు భాగాలుగా విభజించి, సగం నీటిని జూరాలకు వచ్చే తొలి వరద నుంచి, మిగతా సగం నీటిని శ్రీశైలం నుంచి తీసుకుని కల్వకుర్తి పథకంతో సమన్వయపరచి నిర్వహించాలని కోరాం. మన వాటా నీరు నిలుపుకోవడానికి వెల్టూరు%-%గొందిమల్ల గ్రామాల మధ్య జోగులాంబ రిజర్వాయర్ నిర్మించాలని కోరాం. అమ్రాబాద్‌కు చంద్రసాగర్ నుంచి కల్వకుర్తి పథకం నీరు తరలించాలని చెప్పాం. ఈ ప్రతిపాదనలన్నీ గొప్పగా ఉన్నాయి. మున్ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సాధించుకోవచ్చేమో అని నల్లవెల్లి రంగారెడ్డి ఆశ పడ్డాడు. ఆయనను మహబూబ్‌నగర్ సాగునీటి పథకాల సలహాదారుగా 2024 మే 14న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. అయితే అనారోగ్యంతో బాధ్యతలు చేపట్టకుండానే మే 27న రంగన్న మరణించాడు. ఇంజనీర్ రఘురాంరెడ్డి, ఇతర మిత్రులు రంగన్న మరణం వారి కుటుంబానికి, బంధువులకు మాత్రమే కాదు ఎంతో కాలంగా మోసపోతున్న మహబూబ్‌నగర్ రైతాంగానికి నష్టం అని కంటతడి పెట్టుకున్నారు. పోరాడి తెలంగాణ సాధించుకున్నాం కానీ, జిల్లాకు నీరు సాధించుకోలేకపోయాం, ఇప్పుడైనా అవుతుందేమో అనుకుంటే ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది అని టీజేఏసి మాజీ చైర్మన్ జి. రాజేందర్‌రెడ్డి బాధపడ్డారు. ఐదు దశాబ్దాల వృత్తి, ప్రవృత్తి జీవితానుభవంతో రంగారెడ్డి చివరికి ఒక ప్రతిపాదన చేశాడు. ఏటా వేల టిఎంసిల నీరు సముద్రం పాలవుతోంది. జూరాల ఎగువ నుంచి 200 టిఎంసిల నీరు తీసుకుని, నిలువ చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు బాగుపడతాయి. నీరు లేనప్పుడు లెక్క ప్రకారమే వాడుకోవచ్చు. ఉన్నప్పుడు తీసుకోకపోవడం ప్రభుత్వాల అసమర్థత కాదా అన్నాడు. ఈ సవాలును స్వీకరించి నిజాయితీగా పనిచేసే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికైనా వస్తుందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయం మీద దృష్టి సారిస్తారా? రంగన్న ఆశలు, కలలు నెరవేరుతాయా?

## షుగర్ పేషెంట్స్ స్వీట్స్ తింటే ఆందోళన వద్దు

మధుమేహ వ్యాధిగ్రస్తులు స్వీట్లు తినకూడదు. ఇది షుగర్ పేషెంట్స్ ఆరోగ్యానికి హానికరం. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులు అనుకోకుండా చక్కెర ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తిన్నట్లయితే, భయపడాల్సిన అవసరం లేదు. కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. వీటిని పాటించడం వల్ల శరీరంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. అన్నింటిలో మొదటిది ఆహారంలో స్వీట్లు తిన్న తర్వాత, తదుపరి ఆహారంలో ప్రోటీన్ అధికంగా ఉండేలా ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. పప్పులు, కిడ్నీ బీన్స్ తినండి. ఇవి శరీరంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి. ఆహారంతో పాటు వ్యాయామం కూడా ముఖ్యం. డయాబెటిక్ పేషెంట్ ఎక్కువగా స్వీట్లు తిన్నట్లయితే చురుకైన నడక షుగర్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుందని డాక్టర్ స్వప్నిల్ జైన్ చెప్పారు. స్వీట్లు తిన్న 4 గంటల్లో ఈ వ్యాయామం చేయవచ్చు. బ్రిస్క్ వాక్ ద్వారా షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. బ్రిస్క్ వాక్ అనేది ఒక రకమైన ఫాస్ట్ వాకింగ్. ఇది అలాంటి నడకలో చాలా వేగంగా నడవాలి. గుండె కొట్టుకోవడం పెరుగుతుంది. అయితే పరుగు పెట్టకూడదు. వేగంగా నడవాలి. అరగంట పాటు వేగంగా నడవవచ్చు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

## – తలసాని శ్రీనివాస్

సనత్ నగర్, తెలంగాణ సేన న్యూస్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్ గొల్ల కొమరయ్య కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నిత్యం ఎంతో రద్దీగా ఉండే గొల్ల కొమరయ్య కాలనీలోని ప్రధాన రహదారి పై స్పీడ్ ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కమిటీ హాల్ పై మరో అంతస్తు నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంటనే స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని చెప్పారు. కమిటీ హాల్ లోని మోటార్ పని చేయడం లేదని, నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే ను కోరగా సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదని చెప్పగా లైట్ల ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వాసులు నల్లా కనెక్షన్ ఇప్పించాలని కోరగా, వెంటనే నల్లా కనెక్షన్ కల్పించి నీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే లక్ష్యంతోనే తాను నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో బోయగూడ కమాన్ నుండి మల్లన్న గుడి వరకు ఎంతో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు ను అద్భుతంగా నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తాననే విషయం నియోజకవర్గ ప్రజలు అందరికీ తెలిసిందే అన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కుర్మ హేమలత, డి సి సమ్మయ్య, ఈ ఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ డి ఎం జి ఆశిష్, ఎలెక్ట్రికల్ ఏ ఈ స్ట్రీట్ లైట్ ఏ ఈ అనూష, పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్



రాజు, నాయకులు లక్ష్మీపతి, కాలనీ కార్యదర్శి నర్సింగ్, మనీష్, వినోద్, కుమార్ యాదవ్, శంకర్, జనార్ధన్, గజ్జెల శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే తలసాని పరామర్శలి

గొల్ల కొమరయ్య కాలనీకి చెందిన భాగ్య ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. కాలనీ పర్యటన కు వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ భాగ్య ఇటీవల చికిత్స చేయించుకొని ఆసుపత్రి నుండి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లారు. భాగ్య ను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

# అతిథి అధ్యాపకుల కొరకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరణ



మహబూబాబాద్, తెలంగాణ సేన,డిసెంబర్17 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ మహిళా కళాశాల మహబూబాబాద్ నందు బి. ఫార్మసీ బోధనాంశములలో ఫార్మస్యూటిక్స్(1), ఫార్మకాలజి (1), ఫార్మకెమిస్ట్రీ (1) 2024-25 విద్యా సంవత్సరమునకు గాను అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని, అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు బి. పార్మసీ, యం. ఫార్మసీ మరియు సర్వీస్ సర్టిఫికేట్స్ జిరాక్స్ ప్రతుల్ని తేది. 21/12/2024 సాయంత్రం 4:00 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించగలరని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. స్వప్న రెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

# లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం


## – అరాచక,దుర్మార్గ నికృష్టమైన ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు....



లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి, వెంటనే విడుదల చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామం పంచాయతీలు పరిధిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల రైతులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దే దాకా, వారిపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకునే వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతన్నలకు క్షమాపణ చెప్పేదాకా భారాస పోరాటం కొనసాగుతుంది' అని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.తమ భూమిని కాపాడుకునేందుకు, ప్రభుత్వం గుంజుకుంటే ఇవ్వబోమని చెప్పినందుకు లగచర్లకు చెందిన గిరిజన, దళిత, బలహీనవర్గాల రైతులను జైల్లో పెట్టడంతో పాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు.'లగచర్ల రైతులు నెల రోజుల నుంచి జైలులో ఉన్నారు. ఆ గిరిజన రైతులకు సంకెళ్లు వేసి, యావత్ రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరుస్తోంది అని ఆరోపించారు. లగచర్ల అంశంపై అసెంబ్లీ లో మా పార్టీ ఎమ్మెల్యేలు చర్చ చేయాలని మా పార్టీ అడిగితే, టూరిజం మీద మాట్లాడమన్నారు. ప్రభుత్వం బేషరతుగా రైతులను విడుదల చేయాలి, బేడీలు వేసిన అధికారులను శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ నర్రి నర్రింహ్మా, మాజీ సర్పంచ్ సుర్వి యాదయ్య గౌడ్, కూసుకుంట్ల సత్తిరెడ్డి, మాజీ ఈసం యాదయ్య, మాజీ సర్పంచ్ కట్టేల బిక్షపతి, సర్వేల్ గ్రామ శాఖ బిఆర్ఎస్ అధ్యక్షుడు వీరమల్ల జంగయ్య గౌడ్, మాజీ ఆలయ చైర్మన్ లు వెనుముల జగన్ రెడ్డి, వర్ధన్ నాగార్జున, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నలపరాజు పద్మ స్వామి, సిరిపంగి పెద్దులు, కత్తుల గాలయ్య, మల్లయ్య భాను, సురేష్, మాజీ వార్డ్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు రెవిన్యూ సదస్సులను ఉపయోగించుకొని భూ సమస్య సమస్యలను పరిష్కరించుకోవాలి

## – గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి




రంపచోడవరం, తెలంగాణ సేన న్యూస్ : ఎటపాక మండలం పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలలో రెవిన్యూ సదస్సులో భాగంగా రెండు పంచాయతీలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో స్థానిక సర్పంచ్ లతో పాటు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు 33 రోజులపాటు రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుంది కావునప్రజల భూములకు సంబంధించి, భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు భూ సమస్య, భూవిస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల నమోదు అయిన తప్పులు, కబ్జాలతో కోల్పోయిన భూములు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, వంటి వాటిపై వినతలు తీసుకొని పరిష్కారం చూపుతారు అని గుండాల ఎంపిటిసి గారు తెలిపారు ఈ కార్యక్రమంలో, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, సర్పంచ్, గుండి సీతాలక్ష్మి, ఉపసర్పంచులు, సార్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట శశి కుమార్, తహసిల్దార్ కారం సుబ్బారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మరియు రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు మెడికల్ సిబ్బంది మరియు గ్రామ పంచాయతీల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం

## – చాడ విష్ణువర్ధన్ రెడ్డి బీజేపి నాయకులు



గజ్వేల్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో బిజెపి మెరుగ్గా ఉందని కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు తిరస్కరిస్తారన్నారు. కెసిఆర్ ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది అవుతున్న గజ్వేల్ ప్రజల వద్దకు రాకపోవడం ఆయన అహంకార ధోరణికి నిదర్శనం అన్నారు.హరీష్ రావు అనుచరులు అవినీతిలకు పాల్పడ్డారని వాటిని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. వార్డు మెంబర్ గా గెలవని బిఆర్ఎస్ నాయకులు అన్ని గెలిచినట్టు మాటలు మాట్లాడుతున్నారని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో ఓడించిన హరీష్ రావు అనుచరులకు అహం కారం తగ్గలేదని ఇలానే కొనసాగితే వారి దోపిడీ మళ్లీ మొదలు పెడతారన్నారు. ప్రభుత్వ సబ్సిడీ నుండి రైతులకు ఇచ్చే ట్రాక్టర్లు సర్పంచులు ఎంపీటీసీలు పంచుకున్నారని కాంట్రాక్టర్లు వేలకోట్లు దండుకుని ఏమీ లేని నాయకుడు వేల కోట్లు దండుకున్నారని మండిపడ్డారు అహ్మదీపూర్ గ్రామంలో శ్రీరాముని ఆశీర్వాదంతో బిజెపి గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు

# అమ్మ మరణించిన, మరణం లేనిది అమ్మ ప్రేమ: లాయర్స్ ఫోరం రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది నర్రి స్వామి



మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సర్వేల్-2 కీర్తిశేషులు నర్రి పున్నమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆమె భర్త నర్రి భగవంతయ్య, కుమారులు నర్రి నర్సింహ, నర్రి స్వామి కూతురు ఆది అండాలు ల ఆధ్వర్యంలో విగ్రహాన్ని సొంత ఖర్చులతో నిర్మాణం చేశారు. ఈ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం లాయర్స్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి మాజీ ఎంపీటీసీ సభ్యులు నర్రి భగవంతయ్య నర్రి నరసింహ మరియు కుటుంబ సభ్యులంతా కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింద. ఈ సందర్భంగా లాయర్స్ ఫోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నర్రి పున్నమ్మ చిన్న కుమారుడు నర్రి స్వామి మాట్లాడుతూ ఈరోజు మా స్వగ్రామంలో మా తల్లిగారు మాజీ ఎంపీటీసీ నర్రి పున్నమ్మ గారి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషకరం కష్టజీవిగా బడుగు బలహీన వర్గాల మహిళల నాయకురాలుగా విశేషమైన కృషి చేసింది కాబట్టి ఆమె జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఇది మా సొంత ఖర్చులతోని సమాజానికి స్ఫూర్తిని ఇవ్వడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది.

.అమ్మ మరణించిన అమ్మ జ్ఞాపకాలు మరణించవు అందుకని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బంధుమిత్రులు కుల బాంధవులు అనేకమంది న్యాయవాదులు సామాజికవేత్తలు, తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఆమెతో పని చేసిన అనేకమంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# అంబేద్కర్ గారి విగ్రహానికి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ



భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు మరియు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైళ్ళల్లో నిర్బంధించి రైతన్నల చేతులకు బేడీలు వేసి అణచివేతకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు దిశగా పాలిస్తుంది అని మండిపడ్డారు రైతన్నలపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది నియంత పాలనలా ఉందని ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని అన్నారు.రైతుల ప్రభుత్వం అని చెప్పి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం రైతులపై అక్రమ కేసులు నమోదు చేసి వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి అణచివేస్తుంది అని కార్పొరేటర్ సామల హేమ, మండిపడ్డారు ఈ కార్యక్రమంలో బౌద్ధ నగర్ కార్పొరేటర్ కంది శైలజ, బి అర్ ఎస్ నాయకులు రాజా సుందర్,జాకీర్ శైలెందర్,సాయి యాదవ్,సాగర్,సాయి,సాగర్ గౌడ్ మహిళ నాయకులు లలిత,అర్చన తదితరులు పాల్గొన్నారు

# జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలి

## – ఏకసభ్య కమిషన్ కు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ అమలును అధ్యయనం చేయడానికి నియమితులైన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ గారిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ మంద కృష్ణ మాదిగ గారు కలవడం జరిగింది. ఈ సందర్భంగా పలు వినతులతో కూడిన నివేదికను వారికి సమర్పించడం జరిగింది. రాజ్యాంగంలో రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికనే నిర్ధారించడం జరిగిందని అదే మాదిరిగా ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అందేలా వర్గీకరణను అమలు చేయాలని సూచించడం జరిగింది. ఉమ్మడి రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన ఎలా అయితే నిర్ధారించారో అదే విధంగా ఉమ్మడి రిజర్వేషన్ల వర్గీకరణను కూడా జనాభా ప్రాతిపదికననే నిర్ధారించాలని కోరడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా 70 శాతం ఉందని అన్నారు.కనుక పదిహేను శాతం ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలకు 70% వాటాను కేటాయించాలని కోరడం జరిగింది. మాదిగల జనాభాకు తగినట్టుగా విద్యా ఉద్యోగ అవకాశాలు రాకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఈ అన్యాయం తొలగిపోవాలంటే ఎస్సీ వర్గీకరణ మాత్రమే పరిష్కారం అని అన్నారు. మాదిగలు తమ జనాభా నిష్పత్తి కనుగుణంగానే వాటాను కోరుతున్నారే తప్ప ఇతరుల వాటాను కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎస్సీలలో ఉన్న ప్రతి కులాన్ని స్వతంత్రంగానే గుర్తించాలని, ఏ కులానికి, ఆ కులం స్వతంత్రంగా ఉండాలో లేదా ఎవరితో కలిసి ఉండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికే వదిలేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ ఎం ఎస్ పి జాతీయ నాయకులు నరేంద్ర బాబు మాదిగ, మాదిగ మహిళ జాతీయ నాయకులు జెపి లత మాదిగ, సీనియర్ నేత తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ మాదిగ దప్పు మల్లికార్జున మాదిగ అరుణ్ మాదిగ, బంజూరీ విజయ్ రామరపు శ్రీనివాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ విప్లవ యోధుడు దర్యా నాయక్ కన్నుమూత



జనగాం, తెలంగాణ సేన న్యూస్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సజీవ సాక్షి (107) దర్యా నాయక్ ఇక లేరు. జనగాం జిల్లా దేవరుప్పుల మండలం ధర్మపురంలో శాంతించిన సముద్రమోలే కనిపించే సమరయోధుడు సోమవారం సాయంత్రం 7 గంటలకు తుదిశ్వాస విడిచారు. గొంతు విప్పిండా పిరంగులై ఉరుముతాడు. ఉరిశిక్షకు బెదరని నిబ్బరం, చెదరని ఆశయాల ఆశలు మనల్ని కర్తవ్యోన్ముకుల్ని చేస్తాయి. క్షమాపణ చెప్పితే ఉరిశిక్ష రద్దు చేస్తామంటే, సమసమాజం కోసం పోరాడుతున్నం తప్పు చేయలేదు క్షమాపణచెప్పేదీ లేదని జడ్జీకి జవాబిచ్చిన యోధుడతడు. తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటం లో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. 7 సంవత్సరాల జైలు జీవితం గడిపాడు. మొదట నల్లా నర్సింహులు దళంలో తర్వాత గబ్బెట తిరుమల్ రెడ్డి దళంలో అలుపెరుగని సాయుధ యోధుడుగా సమరంలో నిలిచాడు. దర్యానాయక్ తండ్రి “హాము” తన ఆరుగురు కొడుకులను పెద్ద కోడలు పూలమ్మను యుద్ధ వీరులను చేసి, మనుమన్ని కొరియర్ గా తయారు చేసాడు. మొత్తం కుటుంబమంతా సాయుధ పోరులో వీరులై విస్నూరు దొరకు ఉచ్చ పోయిచ్చింద్రు.


వీరుల జాడలు చెప్పకుండా రహస్యాలు నోటి నుండి విప్పకుండా తనను తాను అగ్నికి ఆహుతి చేసుకుండు ఒక కొడుకు “సోమ్లా నాయక్”. మరో కొడుకు యుద్ధంలో మిల్ట్రి చేతికి చిక్కి చిత్ర హింసలనుభవించి తెలంగాణలో మొదటి ఎన్ కౌంటర్ యోధునిగా చరిత్రకెక్కాడు “ఠానూ నాయక్”. జనగామలో ప్రజల చేతిలో చావు దెబ్బలుతిన్న “బాబుదొర” దాహం దాహం అంటే ఉచ్చపోసి కసితీర్చుకుంది ¡్మ. హాము కుటుంబ సాహసాలు అజరామం. చరిత్రే హాము కుటుబాన్ని చదవాలి.హాము చిన్న కొడుకే దర్యానాయక్.

# ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రియేటివిటీ క్లబ్ లో భాగంగా సైన్స్ పట్ల ప్లాస్టిక్ రీసైక్లింగ్ కొత్త రకాల అవగాహన కార్యక్రమం.



మహుబాబాద్ తెలంగాణ సేన డిసెంబర్ 17 మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామంలోని %గ్లానూ% జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రియేటివిటీ క్లబ్ లో భాగంగా సైన్స్ పట్ల ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం ద్వారా కొత్త రకాల అవగాహన కల్పించారు,దింట్లో భాగంగా జిల్లా కోఆర్డినేటర్ స్రవంతి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థిని విద్యార్థుల్లో ఇలాంటి నైపుణ్యాలను వెలికి తీస్తూ వారిని వారి శిక్షణ నైపుణ్యాలను గుర్తించి ఉన్నత శిఖరాలను అందే విధంగా చేయుటలో భాగంగా పిల్లలు ఎలా చేశారనేదాని గురించి ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో క్రియేటివ్ క్లబ్ సంబంధించిన మెంబెర్స్ తాటి మల్లయ్య పరిశీలించి పిల్లలతో మాట్లాడుతూ వివిధ రకాల సైన్స్ గురించి అవగాహన కల్పించారు అనంతరం స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మందుల శ్రీరాములు ఈ స్వచ్ఛంద సంస్థ వారు చేస్తున్నటువంటి ఈ మంచి కార్యక్రమానికి అభినందించారు.మేము ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు ఎన్నడును చూడలేదని మా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అవగాహన కల్పించినందుకు మా సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు,పిల్లలు వారి యొక్క అభిప్రాయాన్ని మాటల్లో వర్ణించలేకపోయారు.ఇలాంటి ఎక్స్పర్మెంట్స్ మేము ఎప్పుడో చూడలేదు టీవీలలో పేపర్లో చూడడం తప్ప మేము ఎప్పుడూ ఇలా చేయలేదు ఇది చేస్తుంటే మాకు చాలా ఎక్సైట్మెంట్ గా అనిపించింది.ఇలాంటి రకరకాల ఎక్స్పరిమెంట్స్ మాకు ఎప్పుడు నేర్పిస్తూ ఉండాలని పిల్లలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ ఫౌండేషన్ ఎడ్యుకేషన్ మహబూబాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ స్రవంతి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పాదురి శంకర్ రెడ్డి



శాలిగౌరారం, శాలిగౌరారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా పాదూరి శంకర్ రెడ్డిని నియమిస్తూ ఎపిసి సెక్రటరీ రఘునందన్ రావు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి చైర్మన్గా పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా నరిగే నరసింహ, డైరెక్టర్లుగా ఐలయ్య, సోమయ్య ,అంజమ్మ, రాజుల శ్రీనివాస్ దేవరకొండ జయరాజు ,లక్ష్మీనరసింహారెడ్డి, షేక్ లతీఫ్ ,బోడ దానయ్య పడాల రమేష్ ,తాందూరి సత్తయ్య ,రమేష్, జోజి రెడ్డి లతో పాటు ,శాలిగౌరారం పి ఎసి ఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నకిరేకల్ ,శాలిగౌరారం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ తో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలిగా నియమించారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం చైర్మన్ గా అవకాశం కల్పించేందుకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఎమ్మెల్యే మందుల సామేలు కు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి , మండల కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సేన

బుధవారం, 18 డిసెంబర్, 2024

# దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంట రాధా ఆధ్వర్యంలో..

**- 1000 మంది ఆదివాసులకు దుప్పట్ల పంపిణీ**

**- సేవలు మరింత విస్తరింప చేస్తాం**



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ మణుగూరు : డిసెంబర్ 17. మణుగూరు లో ధానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాధ ఆధ్వర్యంలో 1000 మంది ఆదివాసులకు ఉచిత దుప్పట్లు పంపిణీ చేశారు మంగళవారం మణుగూరు మండలం అన్నారం గ్రామంలో దుప్పట్ల కార్యక్రమం జరిగింది శ్రీ దత్త వ్యూ మెన్ సర్వీసెస్ సేవాదళ్, హైదరాబాద్ వారి సహకారంతో దుప్పట్ల పంపిణీ నిర్వహించామని చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా గంట రాధా మాట్లాడుతూ మణుగూరు సబ్ డివిజన్ లోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం తదితర మండలాల్లో ఆదివాసి గ్రామాలలో రోడ్డు కరెంటు విద్యా, వైద్య సౌకర్యాలు లేవన్నారు. పాఠశాల సౌకర్యాలు లేక చిన్న పిల్లలు, తల్లిదండ్రుల తో వేటకు వెళుతున్నారని పాఠశాల సౌకర్యాలు ఏర్పాటు చేసి చదువు అందించాలని కోరారు. పెద్దల సహకారంతో ఉచిత బట్టల పంపిణీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వాలంటీర్లు సుమారు వెయ్యి మందికి పైగా ఆదివాసులు గ్రామస్తులు పాల్గొన్నారు. పిహెచ్సి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించామని డాక్టర్ శివకుమార్ తెలిపారు. హైదరాబాద్ సేవాదళ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలు

ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన కదలి రండి కదలి రండి ఏటూర్ నాగారం 2024 డిసెంబర్22,23, తేదీలలో 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి. తుడుందెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు: సువర్ణపాక వెంకటరత్నం. ప్రియమైన ఆదివాసి ప్రజలారా! ప్రజాస్వామ్యక వాదులారా!! భారతదేశంలో వేల సంవత్సరాలుగా అడవులు, కొండలను నివాసంగా ఏర్పరచుకొని ఆదివాసి తెగలు జీవనం కొనసాగిస్తున్నాయి. వీరికి ప్రత్యేక భాష,సంస్కృతి,సంప్రదాయం కలిగియున్నారు. ఆదివాసి తెగల జీవన విధానం అడవులతో ముడిపడి ఉన్నది. జీవన ఆధారమైనట్టు వంటి అడవి ప్రాంతంలోని భూ సంపద, నీటి వనరులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆదివాసులు ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండడం వలన, నిజం ప్రభుత్వం, స్వతంత్రం ఏర్పడ్డ తరువాత భారత రాజ్యాంగం ఏర్పడేటప్పుడు షెడ్యూల్ తెగలుగా గుర్తించబడి, భారత రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్ లో ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నారు. ఆదివాసి తెగలపై రాష్ట్ర ప్రభుత్వాలు స్వతంత్రం అనంతరం శ్రమ, ఆర్థిక, సామాజిక,రాజకీయ పీడన కొనసాగిస్తున్నాయి. భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులు, చట్టాలను గుర్తించిన ఆదివాసీలుహక్కులు,చట్టాలు అమలు జరగాలని ఆదివాసి పోరాట వీరులు: రాంజీ గోండు, బిర్సా ముండా, గూండా దూర్, మల్లు దొర, గంటం దొర, సోయం గంగులు పోరాటాలను ఉద్యమ స్ఫూర్తితో ఆదివాసులు మా ఊర్లో - మా రాజ్యం, జల్ జంగిల్ జమీన్ కొరకు లి1996 ఆగస్టు 6వ తారీకున ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. తుడుం దెబ్బ ఆవిర్భవమే షెడ్యూల్డ్ తెగల వర్గీకరణ కోసం ఏర్పాటు చేయబడింది. విద్య, ఉద్యోగ,రాజకీయ, ఆర్థిక, సంస్కృతిక, సామాజికంగా అభివృద్ధి చెందాలని తుడుం దెబ్బ మొదటి నుండి ఎస్ టి వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నది. నాటి నుండి నేటి వరకు భారత రాజ్యాంగ హక్కులు, చట్టాలు అమలు కొరకు 5వ షెడ్యూల్ ప్రాంత. అటవీ సంపద, పరిరక్షణ కొరకు విద్య, ఉద్యోగ, వైద్యం, రోడ్డు సౌకర్యాలు, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ పథకాల కొరకు నిరంతరం పోరాటం చేస్తున్నది. ఆదివాసి ఉద్యోగులు, ఆదివాసి విద్యార్థులు, ఆదివాసి మహిళలు, ఆదివాసి నిరుద్యోగులు, ఆదివాసి ప్రజలందరూ తుడుం



దెబ్బ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందరూ అన్ని విధాలుగా సహకరించాలని పిలుపునిస్తున్నాం.

**ఆదివాసి ఉద్యమాభినందనాలతో..**

**ఆదివాసి హక్కుల పోరాట సమితి " తుడుం దెబ్బ "**

**మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు:సువర్ణపాక, వెంకటరత్నం.**

# సిఎం కప్ ఫైనల్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీ టీఎస్ దివాకర్



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క ఆదేశాల మేరకు ములుగు మండలం జాకారం గురుకులంలో సిఎం కప్ ఫైనల్ గేమ్స్ ములుగు జిల్లా అన్ని మండలాల టీమ్స్ వారీగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా స్పోర్ట్స్ అధికారి తుల రవి ఆధ్వర్యంలో ములుగు జిల్లా జాకారం గురుకులంలో సిఎం కప్ ఫైనల్ గేమ్స్ నీ జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం కప్ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపి జిల్లా క్రీడాకారులకు మంత్రి సీతక్క ద్వారా గానీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ద్వారా గానీ ఎలాంటి అవసరాలు కావాలన్నా చేస్తామని హామీ ఇచ్చి జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకి,మంత్రి సీతక్క కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తదనంతరం క్రీడాకారులతో కలిసి జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా,జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐస్సార్ ఖాన్ ,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమన్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్విన్ రాథోడ్,జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ చైర్మన్ చిక్కుల రాములు, జక్కుల రేవంత్ యాదవ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జనార్ధన్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్ యాదవ్, నేపాల్ రావు, అన్వేష్,అభినవ్ చారి, సుమన్, శ్రావణ్,రాకేష్, జిల్లా అధికారులు,స్పోర్ట్స్ అధికారులు,పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసి రైతులకు పట్టాలివ్వాలి

**- ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్**



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ వెంకటాపురం : డిసెంబర్ 17. ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామచంద్రపురం గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు అధ్యక్షనలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం అనేక సంక్షేమ చట్టాలను రూపుందించారు. అయినప్పటికీ ఆచరణలో ఈ చట్టాలన్నీ ఘోరంగా విఫలమయ్యాయి అని వాపోయారు. 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టం అమల్లో ఉన్నప్పుడు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల అభివృద్ధి చేసే క్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసుల పోడు భూములపై ఆదివాసులకు హక్కు కల్పించమని అడిగితే ఫారెస్ట్ అధికారులతో కలిసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దౌర్జన్యంగా దుర్మార్గంగా వ్యవహరించి పోడు భూములను నుంచి గెంటివేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం,ముత్తారం, తిప్పాపురం,సీతారాంపురం గ్రామాలలో ఆదివాసులు సాగు చేస్తున్న పోడుపోములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకం రమేష్ ,కుమ్మ సురేష్ కోర్స సారయ్య, తాటి శ్రీను, సోడి రాజు, మడకం దేవి, కుంజ జానకి తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



నర్సంపేట తెలంగాణ సేన జనవరి మూడో తారీకు పరకాలలో జరిగే సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జగదీశ్వర్ నర్సంపేట పట్టణంలోని జయలక్ష్మి కూడలి పాకాల సెంటర్లో వచ్చే నెల మూడవ తేదీ పరకాళ్ళ జరిగే సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జగదీశ్వర్ కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని ఈరోజు సమాజంలో సగం సంఖ్యలో ఉన్న మహిళలు చదువుకోవడానికి కారణం అమ్మ సావిత్రిబాయి పూలే అని ఆమె యొక్క జన్మదినాన్ని పండగల నిర్వహించడం మన యొక్క విద్య అభివృద్ధికి సాంకేతమని మూడవ తారీకు పరకాల జరిగే కార్యక్రమానికి విద్యాభిమానులు అంబేద్కర్ లిస్టులు స్వేరోస్ ప్రజా సంఘాల నాయకులు రాజ్యాంగ అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని తెలియజేశారు ఈ కార్యక్రమానికి స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమ్మ ఒడి సుభద్ర శ్యామల , జిల్లా నాయకులు బొచ్చు రాజు స్వేరో , జోనల్ నాయకులు రఘుపతి స్వేరో జిల్లా నాయకులు వినయ్ స్వేరో చంద్ర సిద్ధార్థ స్వేరో , సమిత్ భార్గవ్ స్వేరో , శ్రీ వర్ధన్ స్వేరో, అనిల్ స్వేరో, మిథిలేష్ స్వేరో, పూజిత స్వేరో మంజుల స్వేరో పాల్గొన్నారు

# 34వ రోజు మహా అన్నదాన ప్రసాద వితరణ.

**- శబరిమల కై ఇరుములతో స్వాములు**




నర్సంపేట తెలంగాణ సేన స్థానిక పట్టణం యందు ఈరోజు 17 డిసెంబర్ 2024 మంగళవారం రోజున శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆదేశాల మేరకు ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ కమిటీ ఆలయ అర్చకులు ఫ్రాన్స్ దేవిష్ మీశ్రా బృందం పూజా నిర్వహణలో దాతలు గట్ల సాయిరాం నవ్యశ్రీ మట్టపల్లి శ్రీకర్ రావు సాహసి రావు జన్మదిన సందర్భంగా పసునూటి వెంకటేశ్వర్లు శోభ లక్కెర సంపత్ రాధిక దంపతుల కుమారుడు పవన్ జన్మదినం జున్నూరు వెంకటేశ్వర్ శ్రీదేవి దంపతుల పెళ్లిరోజు కార్తీక్ శృతి కౌశిక్ బండారి వైకుంఠం ధనలక్ష్మి మాటూరి దక్షిణామూర్తి ధనలక్ష్మి విప్లవ చార్యులు హరిని మొగిలిచర్ల రాజానంద్ మేఘన సలేంద్ర విజయలక్ష్మి సునీల్ మొగిలిచర్ల రాజశేఖర్ తోట్ల హరిప్రసాద్ గణేష్ జన్మదినం కొర్ర తిరుపతయ్య పెంచలమ్మ కీసర రామయ్య జ్యోతి లు ఆలయం నుండి నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా పదినేమిట్టాంబడి పై జోతులు వెలిగిస్తూ శిరస్సుపై నైవేద్యం స్వీకరించి శరణు ఘోష కీర్తనలతో స్వామివారికి నైవేద్యం సమర్పించగా మాలదర స్వాములకు భక్తులకి అన్నదాన ప్రసాద వితరణ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాట్లాడుతూ డిసెంబర్ 22 ఆదివారం రోజున స్థానిక నర్సంపేట డివిజన్ శాసనసభ్యులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో పాటుఆలయ విశిష్ట స్థల ఆలయ అభివృద్ధితో అన్నదాత లు అతిపెద్ద సంఖ్యలో పడిపూజ లో పాల్గొంటూ అన్నదాతలుగా ఉంటున్నారు ప్రతి మాలదర స్వాములు ఎక్కడ పడిపూజ, బిక్ష ఉన్న కానీ ఆలయంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని మాలదార స్వాములను వివిధ గ్రామాల భక్తులను బంధుమిత్ర కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు ఈరోజు వరకు 150 పై ఇరుముడులు ధరించిన స్వాములు ఉండగా రేపు బుధవారము ఇరుముడి కట్టుకును స్వాములు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు కాబట్టి గురుస్వాములు ఆలయ కమిటీ మరియు సిబ్బంది ఆలయంలో పూర్తి బాధ్యతలతో సమయపాలన పాటిస్తూ ఇరుముడి స్వీకరించి స్వాములు తమ ప్రయాణాలు సుఖవంతంగా శబరిమలై చేరుకొని పూర్తిస్థాయిలో దర్శనం చేసుకొని క్షేమంగా తమ తమ గమ్య స్థలాలకు చేరుకోవాలని కోరారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా మాదారపు చంద్రశేఖరం శ్రీరాం ఈశ్వరయ్య భూపతి లక్ష్మీనారాయణ రాజశేఖర్ దొడ్డ వేణు మల్యాల రాజు శ్రీరాముల శంకరయ్య బండారుపల్లి చెంచారావు భరత్ కార్తీక్ లతోపాటు ఆలయ కమిటీ అర్చకులు గురుస్వాములు గుమస్తా దేశి రాము శ్రీధర్ మద్రి రాజు సాయి పటేల్ దాతల కుటుంబ సభ్యులు బంధుమిత్రులుపలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు

# లగచర్ల రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచకాలు సరికావు




కొత్తగూడ తెలంగాణ సేన లగచర్ల రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాశవీకంగా వ్యవహారిస్తున్నారని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రం లో బిఆర్ఎస్ మండల కార్యవర్గం ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వేణు యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగానికి కాలరాస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదాని, తన అల్లుడి కోసం ఫార్మాసిటి అని ఇండస్ట్రియల్ అంటూ రోజుకో మాట మార్చుతూ గిరిజనుల భూములను భయబ్రాంతులకు గురి చేసి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. భూములు వదులుకోమని మొత్తుకున్న రైతులను జైల్లో పెట్టారని తెలిపారు. రైతు రాజ్యం అని చెప్పుకునే ప్రభుత్వం రైతులకు బేడీలు వేసిందని ఏద్దేవా చేశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రేవంత్ ప్రభుత్వానికి లగచర్ల గిరిజన రైతుల ఉసురు తాకుతూందని విమర్శించారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు వేణు యాదవ్. అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ .రైతు బందు సమితి కన్వీనర్ భూక్య సంతోష్. మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి. మాజీ ఎంపీటీసీ మోకాళ్ళ వెంకటేష్. మాజీ సర్పంచ్ బానోత్ కిషన్. సీనియర్ నాయకులు చింత అనిల్. మాలోత్ రావాజీ నాయక్. జిమ్మిడి శ్రీను. బానోత్ అశోక్. బాలకొమూరు. పెండ్లి సాయిలు తదితరులు పాలుగోన్నారు

# జమిలి ఎన్నికలపై లోక్‌సభలో ఓటింగ్



న్యూ ఢిల్లీ, తెలంగాణ సేన న్యూస్: జమిలి ఎన్నికలపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం %-% ఒకే ఎన్నిక' ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకొచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా, మరో బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అనంతరం దీనిపై చర్చ చేపట్టగా.. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ సహా పలు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అటు ఎన్డీయే మిత్ర పక్షాలు బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఆ తర్వాత దీనిపై ఓటింగ్ నిర్వహించారు. ఈ బిల్లుకను ప్రవేశపెడుతూ కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తీసుకొచ్చిన తీర్మానంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించారు. కొత్త పార్లమెంట్ భవనంలో పూర్తి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ క్రమంలోనే ఓటింగ్ విధానంపై లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభ్యులకు వివరించారు. అనంతరం జమిలి బిల్లును ప్రవేశపెట్టడంపై ఓటింగ్ నిర్వహించగా.. 220 మంది అనుకూలంగా ఓటేశారు. 149 మంది వ్యతిరేకించారు. మరోవైపు, ఈ బిల్లుకు భేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు టీడీపీకి చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సభకు తెలియజేశారు. "సృజనాత్మక ఆలోచనలకు తెదేపా ఎప్పుడూ మద్దతిస్తుంది. సహకార, సమాఖ్య తత్వానికి మేం అనుకూలం. జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గి సామర్థ్యం పెరుగుతుంది. పోలింగ్ శాతం మెరుగవుతుంది. ఎన్నికల ఖర్చు రూ.లక్ష కోట్లు దాటుతోంది. నిరంతరం ఎన్నికల నిర్వహణ వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది" అని తెదేపా ఎంపీ వివరించారు.

# 4 వ వార్డ్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటింటి సర్వే



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4,వ వార్డులో మంగళవారం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కౌన్సిలర్ పంబాల అర్చన అశోక్ కుమార్ మాట్లాడుతూ, ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ఐదు లక్షల సహకారం అందిస్తుందని ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న వారు, ఇంటింటి సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలని కోరారు, అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఈదుగాని శివులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, 6 గ్యారంటీల అమలులో భాగంగా ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న ఇల్లు లేని నిరుపేదలకు, ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం అందజేస్తుందని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొల్లూరి సత్యనారాయణ, కృష్ణ నాగరాణి, సుష్మ, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం దౌల్తాబాద్ కు చెందిన సాయికిరణ్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ మాట్లాడుతూ భక్తులు కోరున కోర్కెలు నెరవేర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో దౌల్తాబాద్ కు చెందిన సాయి కిరణ్ స్వామి, శ్రవణ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారని వారి కుటుంబానికి అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు, అయ్యప్ప స్వాములు మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించడానికి అయ్యప్ప దేవాలయంలో ఎన్ని సౌకర్యాలు ఉన్నాయని ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య గురుస్వామి, ఎర్రం శ్రీనివాస్ గురు స్వామి, దుర్గం గురుస్వామి, బొగ్గుల సురేష్ గురు స్వామి, జగ్గయ్యగారి శేఖర్ గురుస్వామి, తుమ్మ గణేష్ స్వామి, కూరగాయల రాంబాబు,అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు

# క్రిస్మస్ వేడుకలు




నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన ముందస్తు క్రిస్మస్ వేడుకలను అందరు సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో ఉన్నటువంటి పాస్టర్స్ డివిజన్ అధికారులు ఆర్డిఓ కమిషన్స్ అందరితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు జరుపుకుంటున్న వారికి వారికి చర్చిల దగ్గర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి మున్సిపాలిటీ సిబ్బంది చర్చిల యొక్క శుభ్రత చేయాల్సినది డ్రైనేజీ ప్రాబ్లం ఉంటే వెంటనే శుభ్రపరచాలి లైటింగ్ లాంటి చర్యలు తీసుకోవాలి. క్రైస్తవులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు ఈ సందర్భంగా పాస్టర్స్ నాయకులు కలిసి జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి గారు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపినారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఆర్డిఓ ఎమ్మార్వో కమిషనర్ నర్సంపేట డివిజన్లో ఉన్నటువంటి పాస్టర్స్ పాల్గొన్నారు డివిజన్ గౌరవాధ్యక్షులు రేవ పిబి రూబెన్ డివిజన్ అధ్యక్షులు గోడ రవికుమార్ జిల్లా అధ్యక్షులు %ఎ% ఆనంద్ రాజ్ నర్సంపేట డివిజన్ సెక్రెటరీ జాన్సన్ నర్సంపేట డివిజన్లో ఉన్న మండల అధ్యక్షులు ఆర్ మత్తయి జిల్లా కమిటీ సెక్రటరీ దయాకర్ నల్లబెల్లి మండల అధ్యక్షులు ఆర్ మత్తయి డివిజన్ పాస్టర్ వై మిల్టన్ పాస్టర్స్ డివిజన్ నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పి.డి.ఎస్.యు. నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి

హైదరాబాద్ తెలంగాణ సేన విద్యరంగ సమస్యలు పరిష్కరించాలని, విద్య రంగానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, విద్య రంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నేడు పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "చలో అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న పి.డి.ఎస్. యు రాష్ట్ర నాయకులను, విద్యార్థులను హైదరాబాద్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర నాయకురాలు కావ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకురాలు పి.అనూషలు కోరారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు పి.డి.ఎస్.యు. చలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కావ్య, అనూషలు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరినందుకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజుల నుండి పి.డి.ఎస్.యు. విద్యార్థి సంఘ నాయకులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తూ, పోలీస్ స్టేషన్లలో నిర్బంధిస్తు, అప్రజా స్వామికంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన పి.డి.ఎస్.యు. రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వి, ఎస్.అనిల్, నరేందర్, భాస్కర్, సాయి, సురేష్, వి.వెంకటేష్ , రాకేష్ లతో పాటు అరెస్టు చేసిన మరో 100 మందిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నాయకులు సాధన, పూజిత,స్వాతి, అఖిల,జ్యోతి, రమేష్, సంజయ్,సుమంత్, బాలు, కళ్యాణ్ అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.




# అసెంబ్లీలో అప్పులపై రగడ

-మొదటిపేజీ తరువాయి

చేశామని చెప్పుకొచ్చారు. గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ మండిపడ్డారు. ఆదాయాన్ని సమకూర్చడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని.. హామీలను నెరవేర్చడమం పెద్ద సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఏడాది అయింది హామీలు నెరవేర్చమని అడిగితే అప్పుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్లు అని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం అంతా తప్పు అని సభ ద్వారా చెబుతున్నట్లు మాజీ మంత్రి తెలిపారు.


**భట్టి సవాల్.. సిద్ధమన్న హరీష్**

అయితే హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను బీఆర్ఎస్ తప్పువదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. అప్పులపై చర్చ జరగాలనే శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సై అన్నారు. భట్టి సవాల్ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు.

**ప్రివిలేజ్ మోషన్పై**

మరోవైపు రేవంత్ ప్రభుత్వంపై తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ అనుమతించాలని సభలో హరీష్ రావు కోరారు. ఇప్పటికిప్పుడు అప్పులపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశాలు ముగిసేలోపైనా అప్పులపై చర్చించాలని పట్టుబడ్డారు. ప్రభుత్వం చెప్తున్న అప్పులకు, వాస్తవ అప్పులకు తేడా ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్పై భట్టి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ సభ్యులా మాపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది. బీఏసీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. గడిచిన పదేళ్లు బీఏసీ ఎలా నిర్వహించారో మర్చిపోయారా? గతంలో పాటించిన నిబంధనలే ఇప్పుడూ పాటించాలి కదా ఎవరైనా రూల్స్ బుక్ ప్రకారమే నడవాలి" అని మంత్రి భట్టి వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి? అని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు ఉన్నాయని.. ఆ బిల్లులు పెండింగ్లో పెట్టింది బీఆర్ఎస్ అని వ్యాఖ్యలు






చేశారు. 40 వేల కోట్ల రూపాయలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని తెలిపారు. ప్రతి గింజా తామే కొంటామని సివిల్ సప్లయ్లో 18 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. హరీష్ రావుకు ఎప్పుడు నిజాలు మాట్లాడే అలవాటు లేదని.. హరీష్ రావు అబద్ధాలు చెబితే అలవాటులో పొరపాటు అనుకున్నామన్నారు. శాసనసభ వ్యవహారాల మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. " అప్పుల విషయంలో ప్రభుత్వం చాలా క్లారిటీగా ఉంది. చేసిన అప్పులను దాచే పరిస్థితి లేదు. నిజాలు చెప్తే ప్రివిలేజ్ మోషన్ అంటే ఊరుకోవాలా? ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మైండ్ పోతుంది. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించిన వాళ్లలో మార్పు రావడం లేదు. అప్పులు ఆస్తుల విషయంలో చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. హరీష్ రావు సవాళ్లు స్వీకరిస్తున్నాను చర్చకు నేను రెడీ" అని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్...**


మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈరోజు నల్ల చొక్కాలు, చేతులకు బేడీలతో అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్నంగా అసెంబ్లీకి వచ్చారు. రైతులకు బేడీలు వేస్తారా అంటూ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు.

**ఎలాంటి చర్చ లేకుండానే మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం**

విరామం అనంతరం ప్రారంభమైన శాసనసభలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. లగచర్ల రైతులను విడుదల చేయాలని, ఈ అంశంపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. కానీ స్పీకర్ చర్చకు అనుమతించలేదు. సభ్యుల ఆందోళనల మధ్యనే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులను సంబంధిత మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. ఇక ఈ బిల్లులపై ఎలాంటి చర్చ చేపట్టకుండా.. శాసనసభ ఆమోదం తెలిపింది. మూడు బిల్లులకు ఆమోదం అనంతరం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. పర్యాటక రంగంపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. అయితే లగచర్ల రైతులను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. ఇదేమీ రాజ్యం.. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

# సంక్రాంతి తర్వాత రేషన్ కార్డులు

**నల్గొండ :** సంక్రాంతి తరువాత కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీ ప్రక్రియను మొదలు పెట్టబోతునట్లు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం శాసన మండలిలో ఈ మేరకు ప్రకటన చేశారు. దాదాపు 10 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేయబోతున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కుడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారుప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కుడా మంత్రివర్గ ఉప సంఘం



పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.సన్న బియ్యం బయట మార్కెట్ లో కిలో నలభై రూపాయలకు పైగానే పడుతుంది. అంత సొమ్ము వెచ్చించి బయట మార్కెట్ లో కొనుగోలు చేయడం సామాన్యులకు అసాధ్యమనే చెప్పాలి. అందుకే ప్రభుత్వం ఇచ్చిన రేషన్ బియ్యంతోనే కొందరు కడుపు నింపుకుంటుండగా, మరికొందరు దోసె పిండి కోసం వినియోగించుకుంటున్నారు. ఇంకొందరు రేషన్ బియ్యాన్ని అక్కడిక్కడే విక్రయించి నగదు తీసుకుని బయటపడుతున్నారు. దీంతో రేషన్ బియ్యం వల్ల ప్రయోజనం లేదని, లబ్ధిదారులు సంతృప్తి చెందడం లేదని భావించిన ప్రభుత్వం రేషన్ బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. బహుశ కొత్త రేషన్ కార్డులు ఫిబ్రవరి నాటికి మంజూరు చేసి ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు అందుతున్న సమాచారం బట్టి తెలుస్తుంది. తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో 90 లక్షల తెలుపు రంగు రేషన్ కార్డులున్నాయి. వీటికి అదనంగా మరో పదిహేను లక్షల కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే మొత్తంకోటి రేషన్ కార్డులు ఉంటాయన్న మాట. అయితే ఇందుకోసం కొన్ని అర్హతలను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డుల ద్వారా కేవలం సన్నబియ్యం మాత్రమే కాకుండా సంక్షేమ పథకాలైన ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు వంటివి అందించాల్సి రావడంతో కొన్ని అర్హతలను నిర్ణయించారు. సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.50 లక్షల్లోపు, పట్టణాల్లో రెండు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్నవారికే తెలుపు రంగు రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద ఉగాది నుంచి కొత్త రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉందేవన్నారు. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్ధిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

## రాష్ట్రపతి ముర్ముకు హైదరాబాద్లో గవర్నర్, సీఎం ఘన స్వాగతం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ వచ్చారు. రాష్ట్రపతి రేపు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం నిర్వహిస్తారు.

## నిరుపేదలకు సాయం!

-మొదటిపేజీ తరువాయి

చేపట్టిన సర్వేలు ఏవీ పూర్తిగా కొలిక్కి రాలేదు. వాటిని ఆధారంగా చేసుకునేందుకు కూడా వీలు లేదు. అందుకే రెవెన్యూ రికార్డులతోపాటు ఉపాధి హామీ పథకాన్ని ఆధారంగా చేసుకుంటుందా అనే అనుమానం ఉంది. ఉపాధి హామీ పథం ప్రకారం రాష్ట్రంలో 53 లక్షళ కుటుంబాల వారికి జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో చిన్న, సన్నకారు రైతులు కూడా ఉంటారు. అందులో వారిని ఎలా వేరు చేస్తారనేది సస్పెన్స్గా మారింది. ఈ లెక్కలతోపాటు రెవెన్యూ రికార్డులు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ లెక్కల ప్రకారం 40 లక్షల కుటుంబాలను భూమి లేని వారిగా ప్రభుత్వం గుర్తించిందని అంటున్నారు. ఈ లెక్కలు కాసేపు పక్కన పెడితే.. అసలు అర్హులను ఎలా గుర్తిస్తారు. భూమి లేని వారిని ఏ ప్రతిపాదికన ఎంపిక చేస్తారనే చర్చ కూడా ఉంది. ఎంతలా కుదించినప్పటికీ పాతిక నుంచి 30 లక్షల కుటుంబాలకు మాత్రం ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉంది. అంటే దాదాపు 15 నుంచి 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. సంవత్సరానికి అంటే మూడు నుంచి 3వేల ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టాలి. రుణమాఫీ, రైతు భరోసా మాదిరిగా కాకుండా ప్రతి నిరుపేదకు న్యాయం జరిగేలా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అనవసరమైన కొర్రీలు పెట్టి ప్రజలను మోసం చేయొద్దని సూచిస్తున్నారు. లేకుంటే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతల నిరసనపై సీతక్క ఇంట్రెస్టింగ్ కామెంట్స్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి, చేతులకు బేడీలతో ఈరోజు (మంగళవారం) అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు వినూత్నంగా బేడీలు వేసుకుని మరీ సభకు వచ్చారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిరసనపై మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప.. కేటీఆర్, హరీష్ బేడీలు వేసుకోలేదని.. ఈ ఘటనతో కేటీఆర్, హరీష్ దొరతనం మరోసారి బయటపడిందని అన్నారు. నిరసనలో కూడా బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదన్నారు. నిరసనల్లో కూడా తమ దురంకారాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. టీఆర్ఎస్ హయాంలో రైతులకు కనీసం పదిసార్లు బేడీలు వేశారని గుర్తుచేశారు. కనీసం అప్పుడు అధికారుల మీద చర్యలు కూడా లేవన్నారు. రైతులకు బేడీలు వేసిన అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయి చర్యలు కూడా తీసుకున్నారని తెలిపారు. సభలో వాళ్ళు పెట్టిన రూల్స్పై వాళ్ళే అభ్యంతరం చెప్పడం ఏంటన్నారు. గతంలో వెల్లోకి వస్తే సభ నుంచి సస్పెండ్ చేసేవారని.. కానీ ఇప్పుడు వాళ్లు పెట్టిన నిబంధనలనే వాళ్లు కాలరాస్తున్నారంటూ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**హాట్హాట్గా అసెంబ్లీ సమావేశాలు**

కాగా.. ఈరోజు అసెంబ్లీ సమావేశాలు హాట్హాట్గా నడిచాయి. రాష్ట్రంలో అప్పుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలయుద్ధం నడిచింది. డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి హరీష్ రావులు సవాళ్లు ప్రతిసవాళ్లు చేసుకున్నారు. ఎఫ్ఆర్బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇస్తూ 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు చేశామని చెప్పుకొచ్చారు. అయితే మాజీ మంత్రి హరీష్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" అని భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సిద్ధమే అని తెలిపారు. భట్టి సవాల్ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు.

## అరెస్ట్ కోసం అన్నా, చెల్లి తహతహ...

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు చిక్కులు తప్పేలా లేవు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీవో ప్రకారం తెలంగాణ తల్లిని అవమానించకూడదని తెలిసినా ఎందుకు ధిక్కరించారు? తనంతట తానుగా అరెస్టు కావాలనే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేశారా? ఫార్ములా ఈ ? రేస్ విషయంలో కేటీఆర్ అరెస్ట్ తప్పదనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయనతో కవిత పోటీ పడుతున్నారా? జీవోను ధిక్కరిస్తున్నానంటూ స్టేట్మెంట్ ఇచ్చి మరీ బహిరంగంగా ఎందుకు కామెంట్ చేశారు? ప్రజలను రెచ్చగొట్టే తీరులో ఎందుకు వ్యవహరించారు? ఇలాంటి అనేక సందేహాలు ఉన్నా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఆమెపై చర్యలు తప్పవనే వార్తలు వినిపిస్తున్నాయి. వేర్వేరు రూపాల్లో జగిత్యాలలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి ఫిర్యాదులు వస్తున్నందున దానికి అనుగుణంగా ఆమెపై చర్యలు తీసుకునే అవకాశాలు లేకపోలేదు.రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న జారీ చేసిన జీవో (నెం. 1946)లో "తెలంగాణ తల్లి చిత్రాన్ని, రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపించడం నిషేధం. తెలంగాణ తల్లి చిత్ర రూపురేఖలను బహిరంగ ప్రదేశాలలోగానీ, ఇతర ప్రదేశాలలోగానీ, ఆన్లైన్లోగానీ, సామాజిక మాధ్యమాలలోగానీ, మాటలు లేదా చేతలతో అగౌరవపర్చడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేడం, అవమానించడం లేదా కించపరచడం నేరంగా పరిగణించబడుతుంది" అని స్పష్టంగా పేర్కొన్నది.ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవిత పట్టించుకోలేదు. "ప్రభుత్వ జీవోలను ధిక్కరించి 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ తల్లి రూపాన్ని అంగీకరించే ప్రసక్తే లేదు. ఉద్యమ తెలంగాణ తల్లిని గ్రామగ్రామానా ప్రతిష్ఠించుకుంటాం. గెజిట్ ఇచ్చినా, కేసులు పెట్టినా భయపడేది లేదు" అని జగిత్యాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లి రూపాన్ని అవమానించేలా వ్యాఖ్యానిస్తే నేరమవుతుందని, ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిసినా ధిక్కరిస్తున్నా అంటూ కామెంట్ చేసి మరీ సవాల్ చేశారు.ఎమ్మెల్సీగా ఉన్న కవిత, ప్రభుత్వ ఉత్తర్వులను స్వయంగా ఉల్లంఘించడంతో పాటు ప్రజలను రెచ్చగొట్టేలా, వారిని ఉద్రేకపరిచేలా బహిరంగ ప్రదేశంలో వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. జీవోకు వ్యతిరేకంగా మాట్లాడడం నేరమని తెలిసినా ఘాటు స్వరంతో వ్యాఖ్యానించడంతో స్వయంగా ఆమె అరెస్టును కోరుకుంటున్నారా? అనే మాటలూ స్థానికంగా పొలిటికల్ లీడర్ల నుంచి వినిపిస్తున్నాయి. ఫిర్యాదుల ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు ఉంటాయనే చర్చ మొదలైంది. ప్రభుత్వాన్నే సవాల్ చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును ఆమె ప్రస్తావించారు.జీవో ప్రకారం తెలంగాణ తల్లిని అవమానించకూడదని తెలిసినా ఉద్దేశపూర్వకంగా ధిక్కరణకు పాల్పడడాన్ని ప్రభుత్వం కూడా సీరియస్గానే తీసుకునే అవకాశమున్నది. ఇప్పుడు ఉపేక్షిస్తే ఇంకొందరు కూడా ఇదే తీరులో రెచ్చిపోతారని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ఇప్పుడు గట్టి చర్యలు తీసుకోవడం ద్వారా పునరావృతం కాకుండా చూసుకోవచ్చన్నది పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం భావన. ఎమ్మెల్సీ కవిత వ్యవహార శైలిపై ఎలాంటి చర్యలుంటాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.తప్పు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి పలుమార్లు హెచ్చరించారు. సినీ హీరో అల్లు అర్జున్ను అరెస్ట్ చేయడంపై వివిధ పార్టీల నేతలు పోలీసుల తీరును తప్పుపట్టినా సీఎం రేవంత్ మాత్రం, చట్టం ముందు అందరూ సమానులే అంటూ ఢిల్లీ వేదికగా క్లారిటీ ఇచ్చారు. నిజానికి అల్లు అర్జున్కు పిల్లనిచ్చిన మామ మాకు బంధువు, మా పార్టీకి చెందినవారు అని సీఎం గుర్తుచేశారు.

# మరోసారి తగ్గిన బంగారం ధర..



బంగారం, వెండి ధరలు నిత్యం మారుతూనే ఉంటాయి. ఒకరోజు పెరిగితే, మరో రోజు తగ్గుతుంటాయి. తాజాగా దేశంలో బంగారం, వెండి ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో కొనేందుకు ఇదే మంచి సమయం అని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం దేశ వ్యాప్తంగా నమోదైన ధరలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం. బంగారం ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చింది. కొంతకాలంగా పెరుగుతూ దడ పుట్టించిన బంగారం ధరలు, ఎట్టకేలకు దిగివస్తున్నాయి. వరుసగా మూడు రోజులుగా తగ్గుతోంది. దీంతో బంగారం కొనేందుకు సరైన సమయం ఇదేనని నిపుణులు చెబుతున్నారు. ఇవాళ మంగళవారం రూ. 10 మేరకు బంగారం ధర తగ్గింది. దేశంలో వివిధ నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,540గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 78,030గా నమోదైంది. ఇక కోల్‌కతాతో పాటు చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,390గా నమోదవ్వగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,880గా ఉంది. మరోవైపు వెండి కూడా బంగారం బాటలో నడుస్తోంది. గత రెండు రోజులుగా వెండి రేట్లు భారీగా తగ్గాయి. హైదరాబాద్, కేరళ, చెన్నైలో కిలో వెండి రూ. 99,900లుగా నమోదవ్వగా.. ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, ముంబైలో కేజీ వెండి ధర రూ. 92,400లుగా కొనసాగుతోంది.




# 20 నుంచి ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ షో

ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మెగా ప్రాపర్టీ షోను నిర్వహించనున్నట్లు తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలోని హైటెక్స్‌లో డిసెంబర్ 20, 21, 22 తేదిల్లో ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గృహ రుణాల్లో ఎస్‌బిఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు. హైదరాబాద్ సర్కిల్‌లో 2024 నవంబర్ 30 నాటికి ఎస్‌బిఐ రూ. 66,249 కోట్ల గృహ రుణ పోర్టుపోలియో కలిగి ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో రూ. 14,578 కోట్ల గృహ రుణాలు, రూ. 5,732 కోట్ల టాప్‌అప్ రుణాలు జారీ చేశామన్నారు. మెగా ప్రాపర్టీ షోలో 50 పైగా పెద్ద బిల్డర్లు తమ ప్రాపర్టీలను ప్రదర్శన, విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకునే వారికి మూడు రోజుల పాటు జరిగే ప్రాపర్టీ షో గొప్ప అవకాశమన్నారు.

# పదేళ్లలో రూ.12 లక్షల కోట్ల రుణాలు మాఫీ




రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు, చాలీచాలని జీతాలతో బతుకు బండిని లాగుతున్న మధ్యతరగతి జీవులు చెల్లించాల్సిన రుణ బకాయిలను బ్యాంకులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. నోటీసులు జారీ చేస్తూ వారిని భయపెడుతుంటాయి. అప్పు తీర్చడం ఆలస్యమైతే తట్టా బుట్టా బయట పడేసి ఇంటి నుండి గెంటేస్తాయి. ఆస్తులు జప్తు చేసి నిలువ నీడ లేకుండా చేస్తాయి. అదే బడా బాబులైతే.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తాయి. వందల కోట్ల అప్పులు ఎగవేసి దేశం వదిలి పారిపోతున్నా ఏమీ ఎరగనట్లే మిన్నకుండి పోతాయి. చివరికి వాటిని రానిబాకీల పద్దులో వేసి, రుణాలు మాఫీ చేసి చేతులు దులుపుకుంటాయి. 2014-15, 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో.. అంటే గత పది సంవత్సరాలలో దేశంలోని వాణిజ్య బ్యాంకులు మాఫీ చేసిన రుణాల విలువ అక్షరాలా రూ. 12.3 లక్షల కోట్లు. వీటిలో 53 శాతం (రూ. 6.5 లక్షల కోట్లు) రుణాలను గత ఐదు సంవత్సరాల కాలంలోనే (2019-20, 2023-24 మధ్య) ప్రభుత్వ రంగ బ్యాంకులు మాఫీ చేశాయి. పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం ఈ వివరాలు అందజేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగం మాఫీ చేసిన రుణాలు గరిష్ట స్థాయి అంటే రూ. 2.4 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2015లో ఆస్తుల నాణ్యతా సమీక్ష ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో రుణాలు రద్దు కావడం ఆ సంవత్సరమే జరిగింది. 2023-24లో అత్యల్పంగా రూ. 1.7 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఆ సమయంలో బ్యాంకులకు రావాల్సిన రుణ బకాయిల మొత్తం రూ. 165 లక్షల కోట్లు. అందులో కేవలం ఒక శాతం మాత్రమే రద్దయింది. బ్యాంకింగ్ రంగ ఇంక్రిమెంటల్ రుణంలో ప్రభుత్వ బ్యాంకులు ప్రస్తుతం 51 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2022-23లో ఈ వాటా 54 శాతంగా ఉంది. 2020-2024 మధ్యకాలంలో అత్యధిక రుణాలు మాఫీ చేసిన బ్యాంకుల్లో ఎస్‌బిఐ మొదటి స్థానంలో ఉంది. ఆ దిగ్గజ బ్యాంక్ రూ. 1,46,652 కోట్ల రుణాలను రద్దు చేయగా.. చేస్తే పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ. 82,449 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ. 82,323 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ. 77,177 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 45,467 కోట్ల రుణాల మాఫీతో తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల స్థూల పారు బకాయిలు వరుసగా రూ. 3,16,331 కోట్లు, రూ. 1,34,339 కోట్లుగా ఉన్నట్లు రిజర్వ్‌బ్యాంక్ తెలిపిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. ఇది మొత్తం పారు బకాయిలలో వరసగా 3.01 శాతం, 1.86 శాతంగా ఉన్నదని వివరించారు.



# 100 బిలియన్ డాలర్లకంటే కిందికి అంబానీ, అదానీ..

భారత కుబేరులు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ ఇద్దరూ వంద బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి బయటకు వచ్చేశారు. అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. జులైలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో అంబానీ తన కుమారుడు అనంత్ వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, అదానీ విషయానికి వస్తే భారతీయ అధికారులకు ముడుపుల వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే, అమెరికా ఆరోపణలు, కేసులు, అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా ఆయన సంపద 100 బిలియన్ డాలర్ల లోపునకు పడిపోయింది.

# కస్టమర్స్ బీ అలర్ట్ .. వాటిని నమ్మొద్దు




ఇటీవల ఎస్‌బిఐ నుండి వస్తున్నట్లుగా కస్టమర్లకు ఫేక్ మెసేజ్‌లు, ఫేక్ వీడియోలు వస్తున్నాయి. పెద్దఎత్తున రిటర్నులు.. అంటూ స్టేట్ బ్యాంక్ టాప్ మేనేజ్‌మెంట్ చెబుతున్నట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ స్పందించింది. ఇవన్నీ కేవలం నకిలీ వీడియోలు అంటూ స్పష్టం చేసింది. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్‌బిఐ ఓ పోస్టును విడుదల చేసింది. "బ్యాంక్ మేనేజ్‌మెంట్‌కు చెందిన వ్యక్తులంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న డీప్ ఫేక్ వీడియోలు నమ్మొద్దు. ఆ వీడియోలో పేర్కొన్న పథకాలతో బ్యాంక్‌కు గానీ, బ్యాంక్ అధికారులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. ఈ వీడియోలో ఫలానా పథకంలో పెట్టుబడి పెట్టండంటూ ప్రజలకు సలహా ఇస్తున్నారు. ఇలాంటి అవాస్తవమైన, అసాధారణ రాబడి ఇచ్చే వాగ్దానాలు ఎస్‌బీఐ చేయదు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి" అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.

## రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూర్వక దాడ



న్యూఢిల్లీ : దేశంలో రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూరిత దాడి జరుగుతోందని సిపిఎం రాజ్యసభ నేత బికాష్ రంజన్ భట్టాచార్య విమర్శించారు. రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని ఆలయానికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లి రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడి చేశారని అన్నారు. లౌకిక, ప్రజా స్వామ్య రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని ఎప్పుడూ వెళ్లి గుడికి శంకుస్థాపన చేయలేరని అన్నారు. 2014 నుంచి రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూర్వక దాడి జరుగుతోందని పేర్కొన్నారు. గతంలో 1975 ఎమర్జెన్సీ సమయంలో దాడి జరిగిందని, ఎమర్జెన్సీ విధించిన వ్యక్తే ఆ తరువాత తన తప్పును అంగీకరించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఎమర్జెన్సీ విధించకుండానే దాడి చేస్తున్నారని, పైగా దాన్నే ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా న్యాయం లభించినప్పుడే రాజ్యాంగం సక్రమంగా అమలవుతుందని స్పష్టం చేశారు. 1970 నాటి జాతీయీకరణ ప్రక్రియ దేశ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే వాళ్లే ఆర్‌ఎస్‌ఎస్‌ను నిర్వహిస్తారని ఆయన విమర్శించారు. జాతీయ జెండాను, అశోకచక్రాన్ని వ్యతిరేకించిన వారు ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని గ్రూపు అని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి అండగా నిలిచారని అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందితే, దానిని తగలబెట్టింది ఆర్‌ఎస్‌ఎస్ అని గుర్తు చేశారు. రాజ్యాంగంపై తన వ్యతిరేకతను ఆర్‌ఎస్‌ఎస్ బాహాటంగానే వ్యక్తం చేసిందన్నారు. భారత రాజ్యాంగం మనుస్మృతిపై ఆధారపడి లేదన్నది ఆర్‌ఎస్‌ఎస్ అభ్యంతరమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మహిళలకు ఓటు హక్కు కల్పించడాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నారని రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల్లో స్పష్టమైందని తెలిపారు.

# సిరియాపై ట్రంప్‌తో నెతన్యాహు చర్చలు



గాజా : సిరియాలోని పరిణామాలపై, గాజాలో హమాస్ చెరలోని బందీల విడుదలపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌తో ఆదివారం చర్చించారు. శనివారం రాత్రి కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు. సిరియాతో ఘర్షణ పడాలని తాము అనుకోవడం లేదని నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరియా నుండి ఎదురయ్యే ముప్పును భగం చేయడానికే తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకున్నారు. మరోపక్క సిరియాలోని రెబెల్ గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) గ్రూపుతో దౌత్య సంబంధాలు నెలకొల్పినట్లు బ్రిటన్ విదేశాంగ మంత్రి ప్రకటించారు. హెచ్‌టిఎస్‌తో సంబంధాలు పెట్టుకున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి కూడా శనివారం ప్రకటించారు. అలాగే సిరియన్లకు 63 మిలియన్ల డాలర్ల (50మిలియన్ల పౌండ్లు) సాయాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దశాబ్ద కాలంగా సిరియాలో సాగిన అంతర్యుద్ధానికి ప్రజలు తీవ్రంగా బలయ్యారు. దేశ మౌలిక సదుపాయాల వ్యవస్థ కకావికలమైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు నిర్వాసితులయ్యారు. చాలామంది దేశం విడిచి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో సిరియన్లకు ఎంతగానో అవసరమైన మానవతా సాయం కింద ఈ మొత్తాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. ప్రజల ఆహారం, వసతి, అత్యవసర ఆరోగ్య సంరక్షణతో సహా 10లక్షల మందికి పైగా ప్రజలకు తక్షణ సాయంగా 30మిలియన్ల పౌండ్లు అందుతుందని తెలిపింది. మరో 10మిలియన్ల పౌండ్లు పొరుగుదేశాల్లోని సిరియన్లకు సాయంగా లెబనాన్‌లోని ప్రపంచ ఆహార కార్యక్రమానికి అందచేయనున్నారు. మరో 10మిలియన్ల పౌండ్లు జోర్డాన్‌కు అందనుంది.

గోలన్ హైట్స్ సరిహద్దులను విస్తరించాలని ఇజ్రాయిల్ భావిస్తోందని టర్కీ విమర్శించింది. ఇందుకోసం ఆదివారం ఒక ప్రణాళికను ఆమోదించారని, దాని ప్రకారం గోలన్ హైట్స్ నగరాల్లోని జనాభాను రెట్టింపు చేయాలని భావిస్తున్నారని పేర్కొంది. అదే గనుక జరిగితే బషర్ ప్రభుత్వ కూల్చివేత తర్వాత సిరియాలో సుస్థిరత నెలకొనడానికి తీసుకునే చర్యలకు ఎదురు దెబ్బ తగులుతుందని విమర్శించింది.


# రైతుల ట్రాక్టర్ మార్చ్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చాలంటూ రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. పంజాబ్–హర్యానా మధ్యనున్న శంభూ సరిహద్దులో రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా భద్రతా బలగాలు అడ్డుకుంటుండటంతో.. వారు అక్కడే మకాం వేసి ఆందోళన చేస్తున్నారు. సోమవారం పంజాబ్ నుంచి రైతులు ర్యాలీగా ట్రాక్టర్‌లపై శంభూ బోర్డర్‌కు బయలుదేరారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు శంభూ సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేశాయి. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లను మరింత పెంచారు. పంటకు కనీస మద్ధతు ధర సహా పలు డిమాండ్‌ల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. కానీ కేంద్ర సర్కారు మాత్రం వారి ఆందోళనను పట్టించుకోవడం లేదు. పైగా పోలీసులతో వారిపై దాడి చేయిస్తోంది. కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 18న పంజాబ్‌లో రైల్‌రోకో నిర్వహించనున్నట్లు రైతులు ఇప్పటికే హెచ్చరించారు.హర్యానాలో నిరసనలు తెలుపుతున్న రైతు సంఘాల ఆధ్వర్యాన రైతులు సోమవారం అంబాలాలో ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఖనౌరి, శంభు సరిహద్దులు వద్ద రైతులు క్రమశిక్షణ, పట్టుదలతో ఆందోళన చేస్తున్నారు. తమపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. రైతులు తమ ట్రాక్టర్లపై జాతీయ త్రివర్ణ పతాకాలను, తమ సంఘాల జెండాలతో కట్టి ముందుకు సాగారు. అంబాలా రోడ్లకు ఒకవైపున ప్రజలు రాకపోకలు సాగించడంతో రెండు మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంది.

# ఢిల్లీ ఎన్నికల్లో సిపిఎం పోటీ

న్యూఢిల్లీ : రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలు (కరావాల్ నగర్, బాదర్‌పూర్) నుంచి సిపిఎం పోటీ చేయనుంది. ఈ మేరకు ఢిల్లీ సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది.

ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసింది. కరావాల్ నగర్ నుంచి సిపిఎం అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది, గుర్తింపు పొందిన సామాజిక కార్యకర్త అశోక్ అగర్వాల్ పోటీ చేయున్నారు. అశోక్ అగర్వాల్ తాను వేసిన వివిధ పిటీషన్లు ద్వారా ప్రభుత్వ పాఠశాల ప్రవేశాల్లో అవకతవకలు, కనీస సౌకర్యాల లేమిని నివారించగలిగారు. అశోక్ అగర్వాల్ పిటీషన్ల కారణంగానే



ప్రైవేట్ పాఠశాలల్లో 20 శాతం సీట్లు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు లభించాయి. గుర్తించిన 47 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం ఇన్‌పేషంట్లను, 25 శాతం అవుట్ పేషంట్లకు చికిత్స అందిస్తున్నారు. బాదర్‌పూర్ నుంచి జగదీష్ చాంద్ శర్మను సిపిఎం పోటీకి నిలిపింది. మీఠాపూర్‌కు చెందిన జగదీష్ ఈ ప్రాంతంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాల్లోనూ ముందున్నారు. ఈ ప్రాంతంలో ఒక ప్రధాన భాగాన్ని 'ఓ' జోన్‌లో ఉంచడానికి ఢిల్లీ డెవలెప్‌మెంట్ అథారిటీ (డిడిఎ) నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి నిర్ణయంతో నిర్మాణ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, మొత్తంగా ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన జీన్స్ డైయింగ్ యూనిట్లు, ల్యాండ్ మాఫియాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారు.

# డ్రగ్స్‌తో అంధకారంలో యువత భవితవ్యం



న్యూఢిల్లీ : మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్రమైన సామాజిక ఆర్థిక, మానసిక దుష్ప్రభావాలు కలుగుతాయని, దీనివల్ల యువత భవితవ్యం మసకబారుతుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. దేశంలోని యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సవాళ్లను ఎదుర్కొనలేక, ఒత్తిళ్లను తట్టుకోలేక కూల్‌గా వుండేందుకు దీన్ని వాడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. సముద్ర మార్గాల ద్వారా పాకిస్తాన్ నుండి భారత్‌లోకి హెరాయిన్ అక్రమ రవాణా చేస్తున్న డ్రగ్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్‌తో ప్రమేయముందంటూ నిందితుడు అంకుశ విపన్ కపూర్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) విచారణను సమర్థిస్తూ జస్టిస్ నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వం ఇలా అన్ని వర్గాల నుండి కూడా సమిష్టి కృషి వుండాలని, అప్పుడే ఈ సామాజిక రుగ్మతను రూపుమాపగలమని కోర్టు పేర్కొంది. మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా)కు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్య, ఉద్యోగాల్లో అన్ని రకాలుగా ఒత్తిడి పెరిగిపోవడం, సాంస్కృతిక ప్రభావాలు వంటివన్నీ ఈ ప్రమాదకరమైన జీవన శైలికి కారణాలవుతున్నాయని పేర్కొంది. సవాళ్లను ఎదుర్కొనడానికి భయపడి ఇలా మాదకద్రవ్యాలను ఆశ్రయించి తప్పించుకుని తిరిగే విధానానికి యువత బానిసలవడం విచారకరమని పేర్కొంది.

# గాయంపై ఉప్పు చల్లుతున్నారు



కొచ్చి : ఈ ఏడాది కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడటంతో భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించింది. ఆ సమయంలో భారత వైమానిక దళం (ఐఎఫ్) రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినందుకు నిధులు చెల్లించాలని కేంద్రం డిమాండ్ చేయడంపై కేరళ ఆర్థికమంత్రి కె.ఎన్ బాలగోపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వయనాడ్ విపత్తు వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే%ా% ఐఎఫ్ దళాలకు నిధులు చెల్లించాలని కేంద్రం డిమాండ్ చేయడం గాయాలపై ఉప్పు రుద్ది నట్టుగా ఉందని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'విపత్తు సహాయం కింద కేరళ రాష్ట్రానికి నిధులు ఇస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. ఆ నిధులను అందించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైంది. వయనాడ్ ప్రకృతి విపత్తుకి ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీతోపాటు పలువురు కాంగ్రెస్, సిపిఐ (ఎం) ఎంపీలు పార్లమెంటు వెలుపల ఇటీవల నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, మాజీ కేంద్ర మంత్రులు వి మురళీధరన్, రాజీవ్ చంద్రశేఖర్ కేరళ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రకృతి విపత్తులలో రెస్క్యూ ఆపరేషన్ బృందాలైన ఐఎఫ్ %-% ఎంసిసిలకు, వాటి ఖర్చుల రీయంబర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లిస్తాయని, విజయన్ ప్రభుత్వం నిధులు ఎందుకు చెల్లించదంటూ ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. దీనిపై కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్ స్పందించారు. ఈ ఏడాది అక్టోబర్ 22న ఎయిర్‌లిఫ్ట్ ఛార్జీల చెల్లింపులు అంశం పరిష్కరించాలని కోరుతూ గవర్నర్ కార్యాలయానికి లేఖ రాశామని పేర్కొన్నారు.

# మెజారిటీ' వ్యాఖ్యపై చర్య

## వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వండి

న్యూఢిల్లీ : వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు సుప్రీంకోర్టు కొలీజియం సమన్లు జారీ చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఓ కార్యక్రమంలో శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగిస్తూ 'మెజారిటీ అభీష్టం' మేరకే దేశం పని చేస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు కొలీజియం ఆయనకు సమన్లు జారీ చేస్తూ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం మంగళవారం సమావేశమై ఈ అంశంపై చర్చిస్తుందని తెలిసింది. ఈ నెల 8న ప్రయాగరాజ్‌లో విహెచ్‌పి కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ ప్రసంగిస్తూ ఉమ్మడి పౌరస్మృతిని సమర్థించారు. 'ఇది చట్టం. ఈ చట్టం మెజారిటీకి అనుగుణంగా పనిచేస్తుంది. కుటుంబం లేదా సమాజం కోణంలో దీనిని చూడండి. మెజారిటీ ప్రజల సంక్షేమానికి, సంతోషానికి ఏది ప్రయోజనకరమో దానినే అంగీకరించడం జరుగుతుంది' అని ఆయన చెప్పారు. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. న్యాయమూర్తి వ్యాఖ్యలు విభజనకు దారితీస్తాయని, అవి రాజ్యాంగ విరుద్ధమైనవని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. యాదవ్ వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలకు సుప్రీంకోర్టు స్పందిస్తూ అలహాబాద్ హైకోర్ట్ నుండి నివేదికను కోరింది. 'జస్టిస్ యాదవ్ ప్రసంగానికి సంబంధించి పత్రికలలో వచ్చిన వార్తలను సుప్రీంకోర్టు గమనంలోకి తీసుకుంది. దీనిపై హైకోర్టు నుండి వివరాలు కోరాము. ఈ అంశాన్ని పరిశీలిస్తున్నాము' అని సుప్రీంకోర్టు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు రాజకీయ, న్యాయ వర్గాలలో కలకలం రేపాయి. అవి న్యాయ వ్యవస్థ నిష్పాక్షికతను ఉల్లంఘిస్తున్నాయని విమర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తిగా చేసిన ప్రమాణాన్ని యాదవ్ వ్యాఖ్యలు ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంటూ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సిపిఐ (ఎం) నేత బృందాకరత్ ప్రధాన న్యాయమూర్తి ఖన్నాకు లేఖ రాశారు. జడ్జి వ్యాఖ్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కూడా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ యాదవ్ అభిశంసన కోసం రాజ్యసభలో 55 మంది ప్రతిపక్ష సభ్యులు నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే.



# కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా

ఒట్టావా : కెనడా డిప్యూటీ ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధాని జస్టిన్ ట్రూడోతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో సోమవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనాడు మన దేశం తీవ్రమైన సవాలును ఎదుర్కొంటోందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కెనడాకు అత్యుత్తమమైన మార్గమేది అనే విషయంలో మనిద్దరి మధ్య గత కొద్ది వారాలుగా విభేదాలు నెలకొన్నాయని ఆమె అందులో పేర్కొన్నారు. 2013లో తొలిసారిగా పార్లమెంట్‌కు ఎన్నికైన ఫ్రీలాండ్ రెండేళ్ల తర్వాత ట్రూడో కేబినెట్‌లో చేరారు. వాణిజ్య, ఆర్థిక, విదేశాంగ మంత్రిగా కీలకమైన పదవులు నిర్వహించారు. తనను వేరే పదవికి మార్చాలని ట్రూడో భావిస్తున్నారని, ఇటువంటి తరుణంలో తాను కేబినెట్ నుండి వైదొలగడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో తెలిపారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముందని ఆర్థిక మంత్రిగా ఆమె నొక్కి చెప్పారు. రాబోయే టారిఫ్ యుద్ధానికి మనం సన్నద్ధం కావాల్సి వుందన్నారు. కెనడా ప్రధాన వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాకు 75శాతం ఎగుమతులు వెళతాయి.

## విశ్వాస పరీక్షలో జర్మనీ ఛాన్సలర్ స్కోల్జ్ ఓటమి

బెర్లిన్ : జర్మనీ పార్లమెంట్‌లో సోమవారం జరిగిన విశ్వాస పరీక్షలో ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ ఓటమి చవిచూశారు. మొత్తం 733 మంది సభ్యులు ఉన్న దిగువ సభలో ఓలాఫ్ స్కోల్జ్‌కు అనుకూలంగా కేవలం 207 మంది మాత్రమే ఓటు వేశారు. వ్యతిరేకంగా 394 మంది ఓటు వేశారు. మరో 116 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో గెలవడానికి అవసరమైన 367 మెజార్టీకి స్కోల్జ్ చాలా దూరంలో నిలిచారు. నవంబర్ 6న మూడు పార్టీల కూటమి ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యంలో ఈ విశ్వాస పరీక్ష నిర్వహించారు. నవంబర్ 6న వివిధ పార్టీల నాయకులు ఏడు నెలల ముందుగానే అంటే ఫిబ్రవరి 23న పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడానికి అంగీక రించారు. స్కోల్జ్ ఓటమితో ఈ ఎన్నికలు మరింత ముందుగా జరిగే అవకాశం ఉంది. స్కోల్జ్ ఓటమితో పార్లమెంట్‌ను రద్దుచేసి ఎన్నికలను నిర్వహించాలా.. వద్దా అనేది అధ్యక్షులు ఫ్రాంక్–వాల్టర్ స్టెయిన్‌మీర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం అధ్యక్షుల ముందు 21 రోజుల సమయం ఉంది.

## జార్జియా రెస్టారెంట్‌లో 12 మంది భారతీయులు మృతి

గుడౌరి : జార్జియాలోని గుడౌరిలో ఒక రెస్టారెంట్‌లో 12 మంది భారతీయుల మృతదేహాలను కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మృతదేహాలపై లాంటి గాయాలు లేదా హింస జరిగిన ఆనవాళ్లు గుర్తించలేదని తెలిపింది. వీరంతా కార్బన్ మోనాక్సైడ్ పీల్చిన కారణంగా మరణించారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపింది. రెస్టారెంట్‌లోని రెండో అంతస్తులో ఉన్న బెడ్‌రూమ్‌ల్లో మృతదేహాలు ఉన్నాయని వెల్లడించింది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తరువాత బెడ్‌రూమ్‌లకు సమీపంలో ఉన్న పవర్ జెనరేటర్‌ను ఆన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపింది. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపింది. మృతి చెందిన 12 మంది భారతీయులేనని భారత రాయబార కార్యాలయం చెబుతుండగా, జార్జియా ప్రభుత్వం మాత్రం 11 మంది భారతీయులు, మరొకరు తమ దేశస్థుడని తెలిపింది. జార్జియాలోని గుడౌరి మంచు పర్వత క్రీడలకు ప్రసిద్ధి. వీటిని చూసేందుకు భారతీయులు ఎక్కువమంది అక్కడ పర్యటిస్తారు. అక్కడి రెస్టారెంట్లలోనూ భారతీయులు పని చేస్తుంటారు.

# ఢిల్లీలో పడిపోయిన గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. ఇటీవలి కాలంలో గాలి నాణ్యతలు మెరుగుపడినా.. మంగళవారం నాటికి మళ్లీ గాలి నాణ్యతలు క్షీణించాయి. ఈరోజు ఉదయం 7 గంటలకు ఎక్యూఐ 421 వద్ద నమోదైందని, తీవ్రస్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యాయని కమిషనర్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) వెల్లడించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఆనంద్ విహార్, అశోక్ విహార్, బవానా, జహంగిర్‌పురి, అలీపూర్‌లలో 400–470 వద్ద గాలి నాణ్యతలు నమోదయ్యాయని సిఎక్యూఎం తెలిపింది. ఢిల్లీలో సాధారణ ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెల్సియస్ నమైదనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. గాలి నాణ్యతలు, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో.. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్మేసింది. దృశ్యమానత బాగా తగ్గింది.

తెలంగాణ సేన
బుధవారం, 18 డిసెంబర్, 2024

# ఎముకలు దృఢంగా ఉండాలంటే ఈ జ్యూస్ తాగాల్సిందే..



మానవ శరీరం నిర్మాణం ఎముకలతో నిర్మితమై ఉంటుంది. ప్రతి కదలిక అనేది ఎముకల ఆధారంగా పని చేస్తుంది.అందుకే ఎముకలు దృఢంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అయితే ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం అవసరం. కొన్ని ఆహార పదార్థాలలో కాల్షియం ఉంటుంది. ఎటువంటి వాటిలో కాల్షియం ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం.. సైన్స్ పరంగా చెప్పాలంటే కొల్లాజెన్, కాల్షియం లతో ఎముకలు తయారవుతాయి.. ఈ కాయలో విటమిన్ సి, డి, ఎ తో పాటుగా కాల్షియం కూడా అధికంగా ఉంటుంది.వీటితో పాటుగా మెగ్నీషయం, పొటాషియం ఉంటుంది.కన్నెక్టీవ్ టిష్యూస్ పెరుగుదల, బలోపేతం చేయడానికి సహాయపడే సిలికా కూడా దీనిలో ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే ఆరెంజ్ జ్యూస్తో పాటు తినేటప్పుడు, కీర దోసకాయలు యూరిక్ యాసిడ్ను మీ శరీరం నుండి బయటకు పంపడం ద్వారా స్థాయిలను తగ్గించటానికి సహాయపడతాయి.

పాలకూర మీ ఎముకల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందించే ఆకుకూరల్లో పాలకూర ముఖ్యమైనది. పాలకూరలో విటమిన్ కె చాలా ఎక్కువగా ఉంటుంది. కేవలం 1 కప్పు పాలకూర మనకు ఒక రోజుకు కావలిసిన విటమిన్ కె శాతంలో 181 శాతం అందిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైన కాల్షియం మరియు మెగ్నీషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఘాటైన అల్లం లో చాలా రకాల పోషకాలు ఉంటాయి. జింజెరోల్ అని పిలువబడే ఒక ప్రత్యేకమైన సేంద్రీయ సమ్మేళనాన్ని కలిగి ఉంటుంది. ఇది శక్తివంతమైన శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది.సైటోకిన్స్ వంటి తాపజనక సమ్మేళనాలు ఎముకలపై ప్రభావం చూపడానికి ముందే వాటిని అణిచివేసేందుకు.. అయితే జింజెరోల్ ప్రముఖ పాత్రను పోషిస్తుంది. ఆరెంజ్ లో సి విటమిన్ , విటమిన్ డి లు ఉంటాయి..కండరాలు, ఎముకలకు అవసరమైన ముఖ్య పోషకం.విటమిన్ డి మన శరీరం కాల్షియం గ్రహించడానికి సహాయపడుతుంది. కాల్షియం ఎముకలు బలంగా తయారవ్వడానికి సహాయపడుతుంది. అందుకే ప్రతి రోజూ ఆరెంజ్ తీసుకోవడం మంచిది.. ఎముకలు దృఢంగా ఉంటాయి. వీటితో పాటుగా గ్రీన్ యాపిల్స్ ను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది.. పైన తెలిపిన వా టిలో కాల్షియం ఉంటుంది.. మీ ఆహారంలో వీటిని తీసుకోవడం మంచిది అంటున్నారు నిపుణులు.

# భోజనం చేశాక ఈ పండ్లు తినండి.



భోజనానంతరం కొన్ని పండ్లు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. వాటిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరగుపడుతుంది.ఇంతకీ ఆ పండ్లు ఏంటి. ఆ ప్రయోజనాలేంటో తెలుసా..ఆపిల్: ఈ పండులో పీచు అధికంగా ఉంటుంది. జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు భోజనం చేశాక ఆపిల్ను తినడం అలవాటు చేసుకోవాలి. ఫలితంగా ఆ సమస్యలన్నీ దూరమవుతాయి. భోజనం చేశాక పదిహేను నిమిషాల తరవాత దీన్ని తినాలి. సన్నగా ముక్కలు తరిగి తీసుకుంటే ఇంకా మంచిది.

అరటిపండ్లు:

ఆరోగ్యం బాగోలేనప్పుడు భోజనానంతరం తప్పనిసరిగా అరటి పండు తీసుకోవాలి. దీనివల్ల శక్తి లభిస్తుంది. తిన్న ఆహారం తేలిగ్గా జీర్ణం అవుతుంది.బొప్పాయి: కొందర్ని అజీర్తి సమస్య బాగా ఇబ్బంది పెడుతుంది. అలాంటి వారికి బొప్పాయి పరిష్కారం సూచిస్తుంది. దీనిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. శరీరానికి కావల్సిన శక్తి అందుతుంది. జీర్ణవ్యవస్థ శుభ్రపడుతుంది. అనారోగ్య సమస్యలున్న వారు వైద్యుల సలహా మేరకు బొప్పాయిని తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది.అనాస: ఉదర సంబంధిత సమస్యలున్న వారు అనాస పండుని ఎక్కువగా తినాలి. దీన్ని తీసుకోవడం వల్ల ఆహారం త్వరగా అరుగుతుంది. దీనిలో ఉండే బ్రొమెలిన్ అనే ఎంజైము జీర్ణాశయ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.అంజీరా: గుప్పెడు అంజీరాలో పదిహేను గ్రాముల పీచు ఉంటుంది. అది జీర్ణ వ్యవస్థను శుభ్రపరిచి.. వ్యర్థాలను బయటకు పంపుతుంది. మిగతా సమయాల్లోనూ అంజీరాను తీసుకోవచ్చు. వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది.

# రోజూ ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ను కచ్చితంగా తాగాల్సిందే..!



మనకు అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉండే కూరగాయల్లో క్యారెట్ ఒకటి. దీన్ని కొందరు కూరల్లో వేసుకుంటారు. కొందరు పచ్చిగా తింటారు. అయితే కొందరు క్యారెట్ను తినేందుకు ఇష్టపడరు. కారణం.. అది తియ్యగా ఉండడమే. అలాంటి వారు దీన్ని జ్యూస్ చేసుకుని తాగవచ్చు. నిత్యం ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ను తాగడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు.

క్యారెట్లలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల కంటి సమస్యలు పోతాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. విటమిన్ ఎ లోపం వల్ల కంటి సమస్యలు వస్తాయి. అలాంటి వారు నిత్యం ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ను తాగితే కొద్ది రోజుల్లోనే చక్కని ఫలితం కనిపిస్తుంది.

మన శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ అనబడే అణువులు ఎప్పటికప్పుడు ఉత్పన్నమవుతుంటాయి. వీటి వల్ల శరీర రోగ నిరోధక శక్తి తగ్గుతుంది.

డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయి. క్యాన్సర్ కూడా వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అయితే క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సదరు ఫ్రీ ర్యాడికల్స్ను నాశనం చేస్తాయి. దీంతో శరీరం సురక్షితంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలోని వ్యర్థాలు, విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి.క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. శరీరం వాపులకు గురి కాకుండా ఉంటుంది. బాక్టీరియా, వైరస్లు నశిస్తాయి. క్యారెట్లలో ఉండే విటమిన్ బి6, కె, పొటాషియం, పాస్ఫరస్ లు ఎముకలను దృఢంగా మారుస్తాయి. నాడీ మండల వ్యవస్థను బలోపేతం చేస్తాయి. క్యారెట్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, అవసరమైన మినరల్స్ కణజాలం నాశనం కావడాన్ని తగ్గిస్తాయి. దీంతో చర్మం కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం పొడిబారకుండా మృదువుగా మారుతుంది. చర్మం రంగు మారుతుంది. మచ్చలు తొలగిపోతాయి. నిత్యం ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. గుండె ఆరోగ్యం పరిరక్షించబడుతుంది.

# ఎముకల్లో నొప్పి, తిమ్మిర్లు కేన్సర్ లక్షణాలే!



శరీరానికి ఆసరాను అందించే ఎముకలకూ కేన్సర్ రావచ్చు. ఎముకలకు వచ్చే క్షయ, కేన్సర్ లక్షణాలు ఒకేలా ఉండడంతో బోన్ కేన్సర్ను క్షయగా భ్రమ పడే ప్రమాదమూ ఉంటుంది. ఎముకల మీద కేన్సర్ గడ్డ ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు ఆధారపడి ఉంటాయి. కేన్సర్ గడ్డ వల్ల ఎముక నొప్పిగా ఉండడం, జ్వరం, రాత్రిపూట చమటలు, బరువు తగ్గడం, గడ్డ వచ్చిన ప్రదేశంలో ఎముక విరగడం వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. కేన్సర్ కాని గడ్డ గుండ్రంగా, నెమ్మదిగా పెరుగుతుంది.

కేన్సర్ కణితి కచ్చితమైన ఆకారం లేకుండా, వేగంగా పెరుగుతుంది. కణితి పెద్దదిగా ఉన్నప్పుడు ఎక్స్రేలలో, చిన్నదిగా ఉన్నప్పుడు ఎమ్మారై, సిటిస్కాన్లలో కనిపిస్తుంది. అయితే కణితి ఏ కోవకు చెందినదనేది నిర్థారించుకోవడం కోసం బయాప్సీ చేస్తారు. బోన్ కేన్సర్ గడ్డలలో ఆస్టియో సార్కోమా, ఈవింగ్స్ సార్కోమా కాండ్రో సార్కోమా, ఫైబ్రోసార్కోమా, కార్టోమా అనే రకాలుంటాయి. ఈ గడ్డలు వయసును బట్టి ఏర్పడతాయి. ఆస్టియో సార్కోమా, ఈవింగ్స్ సార్కోమా చిన్న వయస్కుల్లో వస్తే, కాండ్రో సార్కోమా మధ్య వయస్కుల్లో వస్తుంది. చాలావరకూ బోన్ కేన్సర్లు సెకండరీగానే ఉంటాయి. అంటే, శరీరంలో మిగతా భాగాల్లో వచ్చిన కేన్సర్ ఎముకలకు వ్యాప్తి చెందడం (మెటాస్టాసిస్) ఎక్కువగా చూస్తూ ఉంటాం. నేరుగా ఎముకలకే కేన్సర్ సోకడం కొంత అరుదు. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ కేన్సర్లు ఎముకల మీద చిన్న గడ్డ రూపంలో బయల్పడవచ్చు.

అన్ని సర్జరీలలాగే సర్జరీ, రేడియో, కీమో థెరపీల ప్రాధాన్యత ఈ కేన్సర్కూ ఉంటుంది. కేన్సర్ గడ్డ వచ్చిన ప్రదేశాన్ని తీసేసినప్పుడు చిన్నగా ఉండే సిమెంటింగ్, గ్రాఫ్టింగ్ పద్ధతుల్లో సరిచేస్తారు. ఎముక తీయవలసిన ప్రదేశం ఎక్కువగా ఉంటే, బోన్ బ్యాంక్ నుంచి ఎముకలను తీసుకుని వేయడం, లేదా మెటల్ ఇంప్లాంట్స్ వాడడం జరుగుతుంది. కేన్సర్ కణితి పెద్దదిగా ఉంటే సర్జరీ కంటే ముందు కీమో, రేడియో థెరపీలతో కణితిని చిన్నదిగా చేసి, తర్వాత సర్జరీ చేయడం కూడా జరుగుతూ ఉంటుంది.

ఈ సర్జరీ తదనంతరం ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ ప్రాముఖ్యం ఎక్కువగా ఉంటుంది. సెకండరీ బోన్ కేన్సర్ ఎక్కువ కాబట్టి మిగతా కేన్సర్లను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోగలిగితే ఈ కేన్సర్నూ నివారించుకోగలుగుతాము. కేన్సర్ వచ్చిన ఎముకలను గట్టిపరచడానికి బిస్పాసొనేట్స్ ఇంజెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది. ప్రోస్టేట్ కేన్సర్, లంగ్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్లు మిగతా కేన్సర్ల కంటే ఎక్కువగా ఎముకలకు పాకే గుణం కలిగి ఉంటాయి. కేన్సర్ కణితి వల్ల నరాల మీద ఒత్తిడి ఏర్పడడం వల్ల కాళ్లలో, లేదా చేతుల్లో బలహీనత, తిమ్మిర్లు, తీవ్రమైన నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# పుల్కాలు తింటే బోలెడు హెల్త్ బెనిఫిట్స్



పుల్కాల గురించి వినే ఉంటారు. నార్త్ ఇండియాలో ఇవి చాలా ఫేమస్. దక్షిణాదిన కూడా పుల్కాలను చాలా మంది ఇష్టంగా తింటారు. పుల్కా అంటే అదేదో వెరైటీ డిష్ అనుకోకండి. ఇది చపాతీనే. కానీ చపాతీ లాగే ఉన్నా దీంట్లో కొంత తేడా ఉంటుంది. పెనం మీద చేసిన చపాతీలను తీసుకొని.. పొయ్యి పై లేదా ప్రత్యేక స్టాండ్ మీద పొంగు వచ్చే వరకు కాల్చితే సరిపోతుంది. నిమిషాల్లో నోరూరించే పుల్కా రెడీ. వీటిని పప్పు, ఆకుకూరలతో తింటే భలే టేస్టీగా ఉంటాయి. పుల్కాలను తింటే చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పుల్కాలో కేలోరీలు చాలా తక్కువ మోతాదులో ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి, తక్కువ కేలోరీలతో కూడిన భోజనం తినాలనుకునే వారికి పుల్కా సరైన ఫుడ్గా చెప్పొచ్చు.షుగర్ పేషెంట్లకు పుల్కా మంచి భోజనం. వీటిని తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ స్థిరంగా ఉంటాయి.పుల్కాను తయారు చేయడంలో వాడే గోధుమ పిండిలో విటమిన్ బీ1 ఉంటుంది. ఈ విటమిన్ శరీరానికి హాని కలిగించే కొన్ని రకాల కణాలను బయటకు పంపడంలో పోరాడుతుంది. తక్కువ మోతాదులో నూనెను వాడి పుల్కాను తయారు చేసుకోవచ్చు. ఒక టీ స్పూన్ నూనెతో సుమారుగా 6 పుల్కాలను చేసుకోవచ్చు. ఆయిల్ వాడకుండా కూడా పుల్కాలను తయారు చేసుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వాళ్లు, గుండె నొప్పి, డయాబెటిస్తో బాధపడే వాళ్లు, హెల్తీ లైఫ్ స్టయిల్ను పాటించాలనుకునే వాళ్లకు పుల్కా సరైన మీల్ అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# వాల్నట్ ఆయిల్ తో హెయిర్ ఫాల్ కు చెక్ పెట్టొచ్చు...



ఈరోజుల్లో వయసుతో సంబంధం లేకుండా చాలా మందికి జుట్టు ఊడిపోతూ ఉంటుంది. అయితే వాల్నట్ ఆయిల్ తో హెయిర్ ఫాల్ సమస్యకి శాశ్వతంగా చెక్ పెట్టొచ్చు. అయితే ఈ వాల్నట్ హెయిర్ ఎలా తయారు చెయ్యాలో ముందుగా తెలుసుకోండి.. ముందుగా కొన్ని నీళ్లను వేడి చేయండి. ఇప్పుడు అందులో కప్పుడు వాల్నట్స్ ను కలపండి. దీన్ని పదినిమిషాల పాటు వేడి చేయండి.ఆ తరువాత వాల్నట్స్ ను బయటికి తీసి చల్లారనివ్వండి.ఈ వాల్నట్స్ ను క్రష్ చేసి మెత్తగా రుబ్బుకోండి. ఇప్పుడవి పౌడరీగా మారతాయి.ఈ పౌడర్ ను వెజిటబుల్ ఆయిల్ కు కలపండి. కలర్ మారగానే వాల్నట్ ఆయిల్ రెడీ అయినట్లే..వాల్నట్ ఆయిల్ హెయిర్ ఫాల్ సమస్యను పూర్తిగా తగ్గిస్తుంది. వాల్నట్ ఆయిల్ లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా లభిస్తాయి. వాల్నట్స్ లో యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ ఉన్నాయి.

ఇవి స్కాల్ప్ డేమేజ్ ను అలాగే ఇన్ఫెక్షన్స్ ను అరికడతాయి. స్కాల్ప్ హెల్త్ ను ఇంప్రూవ్ చేయడంలో ఈ ఆయిల్ ఎంతగానో హెల్ప్ చేస్తుంది. తద్వారా, హెయిర్ గ్రోత్ ను ప్రమోట్ చేస్తుంది.వాల్నట్ ఆయిల్ లో హెయిర్ కేర్ విటమిన్స్ ముఖ్యంగా బయోటిన్ లభ్యమవుతుంది. ఇది హెయిర్ గ్రోత్ ను ప్రమోట్ చేస్తుంది. ఇందులో సెలీనియం లభిస్తుంది. ఈ మినరల్ లోపం వల్ల హెయిర్ లాస్ సమస్య ఎదురవుతుంది.

కాబట్టి, వాల్నట్ అనేది ఈ మినరల్ లోపాన్ని భర్తీ చేస్తుంది. దాంతో, హెయిర్ లాస్ సమస్యను నివారిస్తుంది. భయంకరమైన హెయిర్ ఫాల్ ను ఎక్స్పీరియెన్స్ చేస్తున్నవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ఆయిల్ లో పొటాషియం ఉంటుంది. ఇది హెయిర్ కు వాల్యూమ్ అందిస్తుంది. రూట్స్ ను బలపరుస్తుంది.

# పాదాలు పగలకుండా...

శీతకాలంలో పాదాల పగుళ్లు చాలామందిలో ఎదురయ్యే సమస్య. దీనివల్ల నొప్పిగా ఉండడం, నడవడం ఇబ్బంది కావడమే కాదు... పాదాలు అందవికారంగా కూడా కనిపిస్తాయి. వాతావరణం కారణంగా ఈ సీజన్లో కాళ్ళు పొడిబారుతాయి. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే మడమల దగ్గర చర్మానికి పగుళ్ళు వస్తాయి. పాదాలను సరిగ్గా శుభ్రపరుచుకోకపోవడం, వాతావరణంలోని కాలుష్యం, మధుమేహం, సొరియాసిస్, థైరాయిడ్, చర్మ సంబంధమైన సమస్యల వల్ల పాదాలు ఎక్కువగా పగులుతూ ఉంటాయి. మొదట్లోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవచ్చు.

# విలక్షణమే ఆభరణం

అందమైన భామలు... ఆహ్లాదమైన ప్రకృతి దృశ్యాలు... క్యాలెండర్ అనగానే మన కళ్ల ముందు మెదిలేచిత్రాలు! కానీ ఈ క్యాలెండర్ అందుకు భిన్నం. దివ్యాంగులైన ఆరుగురు మోడల్స్ దీనిపై చిరునవ్వులు చిందిస్తారు. పుట్టుకతో కొందరు... వేరొకరి అఘాయిత్యాలకు బలైనవారు కొందరు... కారణవేదైనా వైకల్యం వారి శరీరాలకే కానీ మనసుకు కాదని స్ఫూర్తి నింపే తారలు కాని తారలు వీరు. ప్రముఖ ఫొటోగ్రాఫర్ రిషబ్ దహియాతో కలిసి ఢిల్లీ యూనివర్సిటీ పీహెచ్డీ విద్యార్థిని, సామాజికవేత్త పూర్వా మిట్టల్ రూపొందించిన ఈ 'ఆడిటీ 2021' క్యాలెండర్ విశేషాలివి... కొన్ని వారాలా కిందటి మాట ఇది. సుదీర్ఘ లాక్డౌన్ తరువాత పూర్వా మిట్టల్ తొలిసారి ఢిల్లీలోని తన ఇంటి బయట కాలు పెట్టింది. ఇన్ని నెలలూ నాలుగు గోడల మధ్యే ఉన్న ఆమెకు పట్టరాని ఆనందం. ఏదో సాధించిన అనుభూతి. అరుదైన 'స్పైనల్ మస్కులర్ అట్రోఫీ' (వెన్నెముక కండరాల క్షీణత)తో బాధపడుతున్న ఆమెకు కరోనా ముప్పు ఎక్కువని వైద్యులు చెప్పడంతో బయటకు వచ్చే సాహసమే చేయలేదు. అందుకే గడప దాటగానే పూర్వకు అంత సంతోషం. "నాకు ఈ క్షణం 2020లో కెల్లా అపురూపమైనది" అంటూ సంబరపడిపోతూ చెబుతుంది.అయితే పూర్వ బయటకు వచ్చింది ఏదో కాలక్షేపం కోసం కాదు. ఒక మంచి పని కోసం. అందులో భాగంగా మొట్టమొదటిసారి తను కూడా ఒక మోడల్గా కనిపించడానికి సిద్ధమైంది. అదీ ప్రతి ఇంట్లో వేలాడే క్యాలెండర్ మోడల్గా! ఫొటోసూట్లో మేకప్ వేసుకుని, సెలబ్రిటీల్లా పోజ్లు పెట్టినప్పుడు ఆమె ఎంతో ఉత్సుకతకు లోనైంది. ఆ తరువాత కెమెరా ముందు మనస్ఫూర్తిగా ఓ నవ్వు నవ్వింది. షాట్ ఓకే అయింది. క్యాలెండర్లోని రెండు పేజీల్లో ఆమె కనిపిస్తుంది. 'ఆడిటీ' పేరుతో ఇటీవల విడుదలైన ఈ క్యాలెండర్లో ఆమె లాంటి మరో ఐదుగురు దివ్యాంగులైన మోడల్స్ కనిపిస్తారు. వారందరూ దివ్యాంగుల అభ్యున్నతికి పాటుపడుతున్నవారే. ఇలాంటి క్యాలెండర్ ఒకటి తేవాలన్న ఆలోచన పూర్వా మిట్టల్దే. దానికి సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్ రిషబ్ దహియా జతయ్యాడు. దీని అసలు ఉద్దేశం... వైకల్యంపై అవగాహన కల్పించడం, దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతున్న ఆరు స్వచ్ఛంద సంస్థలకు నిధులు సమకూర్చడం. ఈ స్వచ్ఛంద సంస్థలకు ఈ ఆరుగురు క్యాలెండర్ మోడల్స్ సారథులుగా ఉన్నారు. "మోడల్గా నన్ను నేను చూసుకోవానుకున్నా. అందుకే ఈ ఆలోచనకు రూపం ఇచ్చాను" అంటూ పూర్వ సరదాగా చెబుతున్నా... అసలు కారణం మాత్రం ప్రపంచానికి ఓ సందేశం ఇవ్వాలనేదే! "క్యాలెండర్ ఆలోచన రాగానే రిషబ్తో పాటు మరో మోడల్ ఫైజల్ అష్రఫ్ నొమానీతో జూమ్లో చర్చించాను. ఫైజల్ పరిశోధకుడు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్త. అతనికి కూడా మోడలింగ్ కొత్తే" అని చెప్పుకొచ్చింది పూర్వ.వైకల్యంతో జీవితమంటే ఎన్నో ఇబ్బందులు... అవమానాలు. వాటన్నింటికీ ఎదురు నిలిచి లక్ష్యాన్ని ఛేదించినవారు ఎందరో! అలాంటి వారిలో 'ఆడిటీ' క్యాలెండర్ మోడల్స్ ఒకరు. వీరు తమలాంటి వారిలో మనోధైర్యం నింపడానికి, స్ఫూర్తి రగిలించడానికి దీన్ని ఒక వేదికగా వాడుకుని, అవకాశంగా మలుచుకున్నారు. "అడుగడుగునా సవాళ్లు ఎదుర్కొంటున్న నాలాంటి వారితో సరదాగా ఒక షూట్ చేయాలనుకున్నా. ఎప్పుడూ కష్టాలే కాకుండా వారి జీవితంలోని ఆస్వాదపు క్షణాలను కూడా చూపించాలనేది దీని ఉద్దేశం. తద్వారా మోడల్స్గా వాళు మధురమైన అనుభూతికి లోనవుతారు. మాకు సానుభూతి వద్దు. మాలోనూ సామర్థ్యం ఉందని గుర్తిస్తే చాలు" అంటారు పూర్వ. అదే సమయంలో కంటికి కనిపించేవి, కనిపించని సమస్యలు, ఇబ్బందులపైనా దృష్టి పెట్టారామె. నిజానికి పన్నెండు మందితో షూట్ చేద్దామనుకున్నా, కరోనా ఆంక్షల వల్ల ఆరుగురితోనే పూర్తిచేశారు.మరో విశేషమేమంటే రెండే రెండు రోజుల్లో ఈ ఫొటో షూట్ పూర్తి చేశాడు రిషబ్. "నా ఫొటో షూట్లన్నీ సినీ తారలు, మోడల్స్తోనే ఉంటాయి. కానీ విభిన్నంగా ఏదైనా చేయాలని ఎప్పుడూ అనుకొనేవాడిని. కాలేజీలో ఉన్నప్పటి నుంచి పూర్వతో పరిచయం ఉంది. అప్పట్లో తను కూడా నాలానే ఆలోచించేది. ఇన్నాళ్లకు ఇదిగో ఇలా ఒక విలక్షణమైన క్యాలెండర్ కోసం పని చేయగలిగాను. వైకల్యం గలవారితో షూటింగ్ అనగానే సాధారణంగా సెట్లో వాతావరణం గంభీరంగా ఉంటుంది. ఫొటోల్లో పోజులూ అలానే కనిపిస్తాయి. దానికి భిన్నంగా ఈ షూట్ చేశాం. క్యాలెండర్లో ఫొటోలు చూస్తే అర్థమవుతుంది... వారు ఎంత మనోనిబ్బరంగా ఉన్నారో, ఎంత మనస్ఫూర్తిగా నవ్వుతున్నారో! మేం చెప్పదలుచుకున్నది ఒక్కటే... వైకల్యం వారి గుర్తింపు కాకూడదని" అనేది రిషబ్ మాట. ఈ ఆరుగురిలో ఒక్క ప్రణవ్ భక్షీకే మోడలింగ్లో అనుభవం ఉంది. ఆటిజమ్తో బాధపడుతున్న అతడు ఇరవై ఏళ్లకే మోడలింగ్ ప్రారంభించాడు. భారత్లో మొట్టమొదటి ఆటిజమ్ ఉన్న ఫ్యాషన్ మోడల్గా రికార్డులకెక్కాడు. "దివ్యాంగులు ఆనందంగా జీవించడం లేదనే అపోహ సమాజంలో పాతుకుపోయింది. ఇది తప్పని చాటిచెప్పాలనుకున్నాం" అంటాడు ప్రణవ్. "మేకప్ వేసుకున్న తరువాత నన్ను నేనే గుర్తు పట్టలేకపోయా. ఇది నేనేనా అనిపించింది" అని మోడల్గా తన తొలి అనుభవాన్ని పంచుకున్నాడు ఫైజల్. ఏది ఏమైనా "దివ్యాంగులు కూడా ఈ సమాజంలో భాగమే. వాళ్లు మైనార్టీలు కాదు. వైకల్యం ఎవరికైనా, ఎప్పుడైనా సంభవించవచ్చు. ఈ సత్యాన్ని మన సమాజం గ్రహించాలి" అంటూ భావోద్వేగంగా చెబుతున్న పూర్వా మిట్టల్ ప్రయత్నం యువతరానికి స్ఫూర్తి మంత్రం.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332